

నేటి కందం- నేటికి అందం

చోళ మహారాజుల నీ
వేళ మనంబున దలచుచు విజ్ఞుడు మోడీ
కాలాంతరమున నిలచెడి
కీలక నిర్ణయము గొనెను కృతముఖ దగుటన్ !!

ప్రధాన నరేంద్ర మోడీ తమిళనాడు
వెళ్లి చోళ రాజుల విగ్రహాలను
ప్రతిష్ఠించడానికి నిర్ణయం తీసుకున్నారు



-రాధశ్రీ
సెల్:9494481210

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

ఎవరిది ఏకులమైనా
ఎందు కొరకు రచ్చ
తెస్తున్నరు కులరహిత
తెగువకంత మచ్చ.
అధికారం పదవులు
అనుభవించే పెద్దలు
రాజకీయ లబ్ధికొరకు
ఒచ్చగొట్టే ప్రబుద్ధులు

చురక




-వేల్పుల నారాయణ
9440433475

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ మంగళవారం 29-7-2025 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-50 001. సంపుటి :31 సంచిక:265 పేజీలు:6 వెల: రూ.1/-


# ఎన్ కౌంటర్.. పహల్గామ్ ఉగ్రవాదుల హతం!



శ్రీనగర్, జులై 28: భద్రతా దళాలు సోమవారం 'ఆపరేషన్ మహాదేవ్' ప్రారంభించింది. శ్రీనగర్ సమీపంలోని లిద్వాస్‌లోని దట్టమైన అటవీ ప్రాంతంలో ఉగ్రవాదులు హతమయ్యారని భారత సైన్యం తెలిపింది. హతమైన వారిలో లష్కరే తోయిబా ఉగ్రవాది సులేమాన్ ఉన్నాడు. ఇతడే పహల్గామ్ ఉగ్ర దాడిలో ప్రధాన సూత్రధారిగా ఉన్నాడు. మరో ఇద్దరు ఉగ్రవాదులను అబూ హమ్జా యాసిర్ గా గుర్తించారు. ప్రస్తుతం ఇంకా ఆపరేషన్ కొనసాగుతోందని సైన్యం వెల్లడించింది.


ఉగ్రవాదుల నుంచి అనేక గ్రెనేడ్లు, ఏకే-47 రైఫిళ్లు స్వాధీనం చేసుకున్నారు. 14 రోజుల క్రితం అనుమానాస్పద సంభాషణను సైన్యం పసిగట్టింది. అంతేకాకుండా సంచార జాతుల వారు ఇచ్చిన పక్కా సమాచారంతో సైన్యం ఆపరేషన్ చేపట్టి చంపేసినట్లుగా తెలుస్తోంది. సోమవారం ఉదయం 11:30 గంటల ప్రాంతంలో సైన్యం ఉగ్రవాదుల జాడను గుర్తించాయి. ఆ సమాచారాన్ని సంచార జాతుల వారు కూడా పక్కాగా నిర్ధారించారు. అంతే అత్యంత వ్యూహాత్మకంగా సైన్యం ప్రణాళికను అమలు చేసింది. ఉన్న చోటనే ముగ్గురు ఉగ్రవాదులను మట్టుబెట్టింది.

ఏప్రిల్ 22న పహల్గామ్‌లో పర్యాటకులపై ఉగ్రవాదులు విరుచుకుపడ్డారు. మతం పేరుతో 26 మందిని పొట్టనపెట్టుకున్నారు. భార్య, పిల్లల ఎదుటే భర్తలను చంపేశారు. ఈ ఘటన యావత్తు దేశాన్నిగ్భ్రాంతికి గురి చేసింది. అనంతరం భారత ప్రభుత్వం మే 7న ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. వంద మంది ఉగ్రవాదులను హతమార్చారు. అంతేకాకుండా పాకిస్థాన్ వైమానిక స్థావరాలను కూడా ధ్వంసం చేశారు. ఇక పహల్గామ్ ఉగ్రవాదుల కోసం సైన్యం ఎప్పటి నుంచి వేటాడుతోంది. అనూహ్యంగా సోమవారం పార్లమెంట్‌లో ఆపరేషన్ సిందూర్‌పై చర్చ జరుగుతున్న సమయంలో ఉగ్రవాదుల్ని ఆశ్చర్యంగా సైన్యం హతమార్చింది. ఇక ఉగ్రవాదులు హతం కావడంతో బాధిత కుటుంబాల్లో ఆనందం వ్యక్తమవుతోంది. దేశమంతా సంబరాలు చేసుకుంటున్నారు.

# బాలాపూర్‌లోని ప్లాస్టిక్ పరిశ్రమలో భారీ అగ్ని ప్రమాదం

హైదరాబాద్ జూలై 28 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: బాలాపూర్ లోని ప్లాస్టిక్ పరిశ్రమలో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. సోమవారం తెల్లవారు జామున అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక యంత్రాలు ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చాయి. ప్రమాదం జరిగినప్పుడు ఘటనా స్థలంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. భారీగా ఆస్తినష్టం జరిగినట్టు సమాచారం. షార్ట్ సర్క్యూట్ తోనే ఈ ప్రమాదం జరిగిందని అగ్నిమాపక సిబ్బంది భావిస్తున్నారు. ఇంకా వివరాలు తెలియాల్సి ఉంది.

# పాక్ ఓటమిని అంగీకరించి కాళ్లబేరానికి వచ్చింది.. ఆపరేషన్ ముగియలేదు : రాజ్‌నాథ్ సింగ్



న్యూఢిల్లీ, జులై 28:హల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా చేపట్టిన ఆపరేషన్ సిందూర్ ముగియలేదని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. ప్రస్తుతానికి విరామం ఇచ్చినట్లు చెప్పారు. దాయాది తోకజాడిస్తే గట్టిగా బదులు ఉంటుందని హెచ్చరించారు.

లోక్‌సభ లో ఆపరేషన్ సిందూర్‌పై చర్చ సందర్భంగా రాజ్‌నాథ్ మాట్లాడారు. త్రివిధ దళాల పరాక్రమాన్ని చూసి పాక్ తట్టుకోలేకపోయిందని చెప్పారు. వెంటనే కాళ్ల బేరానికి వచ్చిందన్నారు. పాక్ డీజీఎంవో వెంటనే భారత్‌ను సంప్రదించినట్లు చెప్పారు. 'మన సైనిక దళం చేసిన ఖచ్చితమైన దాడుల తర్వాత పాక్ కాళ్లబేరానికి వచ్చింది. ఓటమిని అంగీకరించింది. యుద్ధాన్ని ఆపాలని ప్రతిపాదించింది. ప్రస్తుతానికి ఈ ఆపరేషన్‌ను ఆపాం. భవిష్యత్తులో పాకిస్థాన్ దాడులకు పాల్పడితే.. గట్టిగా బదులిస్తాం' అని రాజ్‌నాథ్ హెచ్చరించారు.

పాక్ దాడులను మన సైన్యం సమర్థవంతంగా తిప్పికొట్టిందని రాజ్‌నాథ్ తెలిపారు. పాక్ నుంచి వచ్చిన అన్ని దాడులను ఎదుర్కొన్నట్లు చెప్పారు. మన వాయుసేన పరాక్రమాన్ని ప్రపంచమంతా చూసిందన్నారు. సైనిక సత్తాను ప్రశ్నించడం విపక్షాలకు సరికాదని రక్షణమంత్రి మండిపడ్డారు. భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' విజయవంతమైందని లోక్‌సభలో గట్టిగా చెప్పారు. సైనిక చర్యలపై ప్రశ్నలు వేసేటప్పుడు ఆచితూచి, ఆలోచించి ప్రశ్నించాలని విపక్షాలకు సూచించారు.

# విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించాలి : ఎంపీడీవో రాధారాణి



హైదరాబాద్, జులై 28: విద్యార్థులకు ఉత్తమ భోదనతో పాటు నాణ్యమైన బోజనం అందించాలని ఎంపీడీవో రాధారాణి అన్నారు. మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని సోమవారం ఆమె తనిఖీ చేశారు. విద్యార్థుల తరగతి గదులు, మూత్రశాలలు, మరుగుదొడ్లు, మంచినీరు, తాగునీరు వసతి, విద్యార్థులకు వడ్డించే అన్నం, కూరలను పరిశీలించారు. వసతి గృహంలో నెలకొన్న సమస్యలను స్వయంగా విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..వసతి గృహంలో విద్యార్థులకు కనీస మౌలిక వసతులను కల్పించాలని సూచించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలన్నారు. వసతి గృహంలో పరిశుభ్రతకు ప్రాధాన్యతనివ్వాలని పేర్కొన్నారు. హాస్టల్‌లో నెలకొన్న సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

# పట్టాలు తప్పిన రైలు.. ముగ్గురు మృతి, 34 మందికి గాయాలు

న్యూఢిల్లీ, జులై 28:జర్మనీలో ఘోర రైలు ప్రమాదం జరిగింది. 100 మందితో వెళ్తున్న రైలు పట్టాలు తప్పడంతో ముగ్గురు మృతిచెందగా, 34 మంది గాయపడ్డారు. జర్మనీలోని సిగ్మరింగెన్ పట్టణం నుంచి ఉల్మ్ నగరానికి వెళుతున్న ప్యాసింజర్ రైలు ఆదివారం సాయంత్రం 6.10 గంటలకు (అక్కడి కాలమానం ప్రకారం) బాడెన్-వుర్టెంబర్గ్ పరిధిలోని రీడ్లింగెన్ పట్టణానికి సమీపంలో ఉన్న అటవీ ప్రాంతంలో పట్టాలు తప్పింది. ఈ ఘటనలో ముగ్గురు ప్రయాణికులు మృతిచెందారని పోలీసులు తెలిపారు. అయితే తొలుత నలుగురు మరణించారని అధికారులు ప్రకటించారు. అనంతరం ముగ్గురు మాత్రమే చనిపోయారని, మరొకరి పరిస్థితి విషమంగా ఉందని చెప్పారు. రెండు రైలు బోగీలు పట్టాలు తప్పాయని, దానికిగల కారణం తెలియరాలేదని వెల్లడించారు. ప్రమాదం నేపథ్యంలో ఆ మార్గంలో 40 కిలోమీటర్ల మేర రైళ్ల రాకపోకలను నిలిపివేశారు.

జర్మన్ చాన్సలర్ ఫ్రెడరిక్ మెర్జ్ మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. రవాణా మంత్రులతో మాట్లాడుతున్నానని, అత్యవసర సేవలను అందించాలని కోరానన్నారు. 2022 జూన్‌లో దక్షిణ జర్మనీలోని బవేరియన్ ఆల్ప్సైన్ రిసార్ట్ సమీపంలో ఓ రైలు పట్టాలు తపడ్డంతో నలుగురు మృతిచెందారు. 1998లో లోయర్ సాక్సోనీలోని ఎస్చెడ్‌లో హై-స్పీడ్ రైలు పట్టాలు తప్పగా, 101 మంది మృతిచెందారు.

# తక్షణ కాల్పుల విరమణకు అంగీకరించిన థాయ్‌లాండ్, కంబోడియా



న్యూఢిల్లీ, జులై 28:థాయ్‌లాండ్, కంబోడియా మధ్య గత ఐదురోజులుగా కొనసాగుతున్న సరిహద్దు ఉద్రిక్తతలకు తెరపడింది. కాల్పుల విరమణకు రెండు దేశాలూ అంగీకరించాయి. దీంతో రెండు దేశాల మధ్య నెలకొన్ని ఘర్షణలకు తెరపడినట్లైంది. రెండు దేశాలూ తక్షణ, బేషరతుగా కాల్పుల విరమణకు అంగీకరించినట్లు మలేషియా ప్రధానమంత్రి అన్వర్ ఇబ్రహీం ప్రకటించారు.

రెండు దేశాల మధ్య నెలకొన్న వివాదంలో మలేషియా మధ్యవర్తిత్వం వహిస్తున్న విషయం తెలిసిందే. థాయ్‌లాండ్, కంబోడియా దేశాలు కాల్పుల విరమణ చర్చలకు అంగీకరించినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవలే ప్రకటించారు. ఈ నేపథ్యంలో మలేషియా ప్రధాని ఇబ్రహీం ఆహ్వానం మేరకు సోమవారం మలేషియాలోని పుత్రజయలో జరిగిన చర్చలకు కంబోడియా ప్రధాన మంత్రి హున్ మానెట్, థాయ్‌లాండ్ తాత్కాలిక ప్రధాని ఫుమ్తామ్ వెచాయాచాయ్ హాజరయ్యారు. మలేషియాలోని చైనా, అమెరికా రాయబారులతో కలిసి మలేషియా ప్రధాని ఇబ్రహీం నివాసంలో చర్చలు జరిగాయి. ఈ చర్చల్లో తక్షణ కాల్పుల విరమణకు రెండు దేశాలూ అంగీకరించాయి.

థాయ్‌లాండ్, కంబోడియా మధ్య గురువారం నుంచి ఘర్షణలు కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఈ ఘర్షణల్లో 35 మందికిపైగా మరణించారు. 1.65 మంది నిరాశ్రయులయ్యారు. ఘర్షణ పడుతున్న రెండు దేశాలతోపాటు 10 ఆగ్నేయాసియా దేశాలతో కూడిన ప్రాంతీయ సంఘం ఆసియన్‌కి సారథ్యం వహిస్తున్న మలేషియా కాల్పుల విరమణ జరపాలని ఇరు దేశాలకు పిలుపునిచ్చింది.

# యాదగిరిగుట్ట దేవస్థానంలో..ప్రక్షాళనకు పది కమిటీలు

## -నిర్వహణ లోపాల నివారణే కమిటీల ధ్యేయం

యాదగిరిగుట్ట, జూలై 28 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మి నరసింహ స్వామి దేవస్థానం పాలన కొత్త పుంతలు తొక్కుతోంది. పాలనలో పారదర్శకత లోపాల నివారణ కోసం ప్రక్షాళనకు దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎస్ వెంకట్రావు ప్రక్షాళన చర్యలు చేపట్టారు. భక్తులకు మెరుగైనతీ సౌకర్యాలు దర్శనాలు కల్పించేందుకు పది కమిటీలను నియమించారు. పాలనాపరంగా నిర్వహణలో అన్ని విభాగాలలో పారదర్శకత పాటించేందుకు లోపాలను నివారించేందుకు అంతర్గతంగా ఆడిటు చేసుకునేందుకు అదేవిధంగా భక్తులు స్థానికుల నుండి ఎలాంటి ఫిర్యాదులు లేకుండా చూసేందుకు కమిటీలను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు దేవస్థానంలోని అన్ని విభాగాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ తమ దృష్టికి వచ్చిన లోపాలను సూచనలను దేవస్థానం కార్యనిర్వహణాధికారి దృష్టికి తీసుకువచ్చే విధంగా ఈ కమిటీలు పరిచారని నిర్ణయించారు దేవస్థానం కార్య నిర్వహణ అధికారి ఈ పది కమిటీలకు చైర్మన్గా వ్యవహరిస్తారు దేవస్థానం అధికారులు సిబ్బందిని సభ్యులుగా నియమిస్తూ కమిటీలను ఏర్పాటు చేశారు

పది కమిటీలు ఇవే....

1) దేవాలయం, ప్రసాదాలు, అన్నదానం పర్యవేక్షణ కమిటీ .2) క్రౌడ్ మేనేజ్మెంట్ కమిటీ. 3) సేఫ్టీ అండ్ సెక్యూరిటీ ఓవర్ సైట్ కమిటీ. 4) పారిశుద్ధ్యం, పరిశుభ్రత పర్యవేక్షణ కమిటీ. 5) విద్యుత్ ,సీసీ కెమెరాలు, వైర్లెస్ వ్యవస్థ, బ్యాటరీ వాహనాలు, ఏసీలు, లిఫ్టుల పర్యవేక్షణ

# గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను పక్కదారి పట్టించింది

## -గిరిజన సంక్షేమం విషయంలో గత కేసీఆర్ ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్దుతున్నాం

## -స్పష్టం చేసిన మంత్రి సీతక్క

హైదరాబాద్ జూలై 28 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: గిరిజన సంక్షేమం విషయంలో గత కేసీఆర్ ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్దుతున్నామని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను పక్కదారి పట్టించిందని ధ్వజమెత్తారు. ఆదివాసి గిరిజన ప్రాంతాలకు రోడ్లు, బ్రిడ్జిలు అవసరమని.. కానీ గతంలో నిధులు పక్కదారి పట్టించడంతో గర్భిణుల ప్రసవవేదన వంటి వార్తలు వస్తున్నాయని చెప్పుకొచ్చారు. హైదరాబాద్‌లో ఇవాళ(సోమవారం) మంత్రి సీతక్క మీడియాతో మాట్లాడారు.ఏ ప్రభుత్వమైనా నిధులను పక్కదారి పట్టించవద్దని మంత్రి సీతక్క సూచించారు. ఎస్టీలకు కేటాయించిన నిధులను వారికే ఖర్చు చేయాలని కోరారు. కేటాయించిన నిధులను అదే అసెంబ్లీ నియోజకవర్గంలో, అదే జిల్లాలో సర్దుబాటు చేయాలి.. తప్ప మైదాన ప్రాంతాలకు తరలించవద్దని ఆకాంక్షించారు. సబ్ ప్లాన్ నిధులను పక్కదారి పట్టిస్తే ఏజెన్సీ ఏరియా వెనకబాటులోనే మగ్గిపోతుందని తెలిపారు మంత్రి సీతక్క.అందుకే ఎస్టీలకు కేటాయించిన ప్రతి పైసా వారికి ఖర్చు చేయాలని సూచించారు. ఎస్టీల్లో ఎక్కువమందికి ఉండటానికి ఇండ్లు లేవని తెలిపారు. కాబట్టి ఎస్టీల ఇండ్ల నిర్మాణం కోసం బడ్జెట్ నిధులను పెంచే అంశాన్ని పరిశీలిస్తున్నామని అన్నారు. ఎస్టీలకు ఇందిరమ్మ ఇండ్ల విషయంలో కనీస స్థల అర్హతను సడలించాలనే డిమాండ్ ఉందని గుర్తుచేశారు. సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లి పరిష్కరిస్తామని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

# అవినీతి, డ్రగ్స్, కల్తీ పదార్థాలు.. కాంగ్రెస్ పాలన నిజ స్వరూపాలు

## -పాలన అనే భావననే ప్రజలు మరిచిపోయే స్థితి ఏర్పడింది

## – బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు డా. ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్

హైదరాబాద్ జూలై 28 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న పాలనా తీరును బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు డా. ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్ గారు తీవ్రంగా విమర్శించారు. అవినీతి, డ్రగ్స్, కల్తీ పదార్థాలు.. ఇవే కాంగ్రెస్ పాలన యొక్క నిజ స్వరూపాలుగా మారాయని ఆయన చెప్పారు. పాలన అనే భావననే ప్రజలు మరిచిపోయే స్థితి ఏర్పడిందని, ప్రతి వారం రాష్ట్రంలో ఏదో ఒక ఆశ్రమ పాఠశాలలో వందలాది మంది విద్యార్థులు ఫుడ్ పాయిజన్ తో ఆసుపత్రుల పాలవుతున్న దుస్థితి దారుణమని వ్యాఖ్యానించారు. ఇలాంటి ఫుడ్ పాయిజనింగ్ ఘటనలు పదే పదే జరుగుతున్నాయని, విద్యాశాఖ తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందని పేర్కొన్నారు. అసలు రాష్ట్రానికి ముఖ్యమంత్రి ఉన్నాడా.. విద్యాశాఖ మంత్రిగా బాధ్యత వహించే వారు ఉన్నారా.. అనే సందేహం ప్రజల్లో పెరుగుతోందని తెలిపారు. బిజెపి తెలంగాణ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ఔషధాల నుంచి నూనెల వరకు, ఆహార పదార్థాల నుంచి విద్యా కేంద్రాల వరకు, ప్రతి దాంట్లోనూ కల్తీ రాజ్యమేలుతోందని అన్నారు. ప్రజలు ఇప్పుడు మానవ బాంబుల్లా జీవిస్తున్న పరిస్థితి ఏర్పడిందని, ఇవి వెలుగులోకి వచ్చినవే తప్ప, వెలుగులోకి రాని ఘటనలు ఎన్నో ఉండే అవకాశం ఉందని ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రతి మంత్రిత్వశాఖలోనూ అవినీతి రోజురోజుకు పెరిగిపోతోందని ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్ గారు విమర్శించారు. విజిలెన్స్ శాఖ ఏం చేస్తోంది.. దాని స్థితిగతులు ఎవరికీ అర్థం కావడం లేదని ప్రశ్నించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ఏ మాత్రం ఆసక్తి లేకుండా, ప్రభుత్వం మౌనం వహించడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం మద్యపానమే ఆదాయ వనరుగా మలుచుకుంటోందని ఆరోపించారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం బెల్ట్ షాపులను తొలగిస్తామని ప్రకటించిందని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం శాసనసభలో బెల్ట్ షాపులే లేవని ఘనంగా ప్రకటించడం విడ్డూరమని మండిపడ్డారు. కానీ ప్రతి వైన్ షాప్ చుట్టూ పదికి పది బెల్ట్ షాపులు ఉన్నాయన్నారు. గత ఆరు నెలల్లో ఒక వైన్ షాప్‌కు వచ్చిన ఆదాయం రెట్టింపైన విషయాన్ని ప్రస్తావిస్తూ, మద్యం అమ్మకాలే ఇందుకు కారణమని చెప్పారు. బార్‌ల సంఖ్య మూడు రెట్లు పెరిగిందని, రేవంత్ సర్కారు పాలనలో మూడు వైన్ షాపులకు ఆరు బార్‌లు అన్న ట్లుగా మద్యం వ్యాపారం విస్తరిం చడాన్ని తీవ్రంగా ఆక్షేపించారు. భూములు అమ్మడం, మద్యం అమ్మడం, ప్రజల జీవన విలువలను తాకట్టు పెట్టే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తోందని ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్ గారు తీవ్రంగా విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలు, వాగ్దానాలు అమలు కావడంలేదని, ప్రజలను మద్యం మత్తులో ముంచి మభ్యపెట్టే యత్నం జరుగుతోందని ఆక్షేపించారు. ప్రజల ఆరోగ్యం తీవ్రంగా ప్రమాదంలో పడుతుండగా, విద్యార్థుల ప్రాణాలకు కూడా రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి పరిస్థితుల్లో మత్తు వ్యాపారానికి, కల్తీ పాలనకు ఒకే ఒక పరిష్కారం ఉందని, అందుకు బిజెపి యే విశ్వసనీయ ప్రత్యామ్నాయంగా ప్రజల ముందుకు వస్తుందని స్పష్టంగా తెలిపారు.తెలంగాణలో ఇటీవల ఫుడ్ పాయిజనింగ్ ఘటనల నేపథ్యంలో రాష్ట్రంలో పర్యవేక్షణ వ్యవస్థ పూర్తిగా విఫలమైందని ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

ముఖ్యంగా హైదరాబాద్ మహానగరంలో పాలనా వ్యవస్థ నియంత్రణ కోల్పోయిందని, విజిలెన్స్ శాఖ నామమాత్రంగా మాత్రమే మిగిలిందని మండిపడ్డారు. ప్రతిరోజూ పత్రికల్లో, ప్రచార మాధ్యమాల్లో యాంటీ కరప్షన్ పేరిట ప్రచారం సాగుతున్నా, వాస్తవానికి రెవెన్యూ, పురపాలక, ఇరిగేషన్, సివిల్ సప్లైస్ శాఖల్లో పూర్తిగా అవినీతి రాజ్యమేలుతోందని పేర్కొన్నారు. పరిపాలన మొత్తం అవినీతిమయం అయిందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వంలో ఉన్న మంత్రులకు వాటాలు ఇవ్వాల్సి వస్తోందని, అధికారులు 'మేము ఏం చేయాలి?' అన్నదానికన్నా 'ఎంత పంచాలి?' అనే దానికే ఎక్కువగా ప్రాధాన్యత ఇస్తున్నారనే దురవస్థ నెలకొందని వివరించారు. అధికార పార్టీ నేతలతో పిచ్చాపాటి మాట్లాడినా "ఢిల్లీకి కూడా కట్టాలి కదబ్బా" అనే మాటలు వినిపిస్తున్నాయంటే.. పరిపాలన ఎంత కలుషితమైందో అర్థం చేసుకోవచ్చన్నారు.కాంగ్రెస్ పరిపాలన మొత్తం కల్తీ మయం అయిందని, మద్యం మయం అయిందని, డ్రగ్స్ మయం అయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు కల్తీ విత్తనాలు పంపిణీ అవుతుండగా, ప్రజల ఆరోగ్యాలు కల్తీ ఆహారంతో ప్రమాదంలో పడుతున్నాయని తెలిపారు. ఈ కల్తీ విత్తనాల వ్యవహారం కూడా త్వరలో బయటపడుతుందని చెప్పారు. అసలు ముఖ్యమంత్రి ఎవరి కోసమే పనిచేస్తున్నాడో ప్రజలకు అర్థం కావడం లేదని, దేనికోసం ఇప్పటికీ పదవిలో ఉండాలనుకుంటున్నాడో చెప్పాలని ఎన్.వి.ఎస్.ఎస్. డిమాండ్ చేశారు. బిజెపి భరోసా కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో రెండు గంటలపాటు ప్రజల వినతిపత్రాలను స్వీకరించామని ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్ తెలిపారు.

# సామాజిక న్యాయ స్ఫూర్తి ప్రదాత శ్రీ జైపాల్ రెడ్డి- డా॥ వకుళాభరణం




హైదరాబాద్ జూలై 28 (ఎక్స్ ప్రెస్ న్యూస్);హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులోని స్ఫూర్తి స్థలంలో బీసీలకు పెట్రోల్ బంకుల లైసెన్సుల్లో 27 శాతం రిజర్వేషన్లు అమలు చేయించిన దార్శనిక నాయకుడు స్వర్గీయ జైపాల్ రెడ్డి స్మారకానికి తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ ఛైర్మన్ డా. వకుళాభరణం కృష్ణమోహన్ రావు సోమవారం ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డా. వకుళాభరణం మాట్లాడుతూ "మండల్ కమిషన్ సిఫారసుల ప్రకారం కేంద్ర ప్రభుత్వ సర్వీసుల్లో బీసీలకు 27 శాతం రిజర్వేషన్లు సాధించడంలో జనతాదళ జాతీయాధికార ప్రతినిధిగా జైపాల్ రెడ్డి నిబద్ధతగా పోరాడారు. రాజకీయ సిద్ధాంతాలకు అతీతంగా బీసీల పక్షాన ఆయన ఇచ్చిన మద్దతు చరిత్రలో నిలిచిపోతుంది. వెనుకబడిన వర్గాల సాధికారతకు ఆయన చేసిన కృషి ప్రతి నాయకుడికి స్ఫూర్తిదాయకం" అని అన్నారు.

# గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను కలిసిన జగన్..

విజయవాడ: ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తన సతీమణి వైఎస్ భారతీతో కలిసి ఈరోజు రాజ్ భవన్ కు వెళ్లారు. ఇటీవల స్వల్ప అస్వస్థతకు గురైన రాష్ట్ర గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్‌ను మర్యాదపూర్వకంగా పరామర్శించారు.

ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నట్టు తెలిసింది. గవర్నర్ ప్రస్తుతం వైద్యుల సూచన మేరకు విశ్రాంతి తీసుకుంటున్నారని రాజ్ భవన్ వర్గాలు వెల్లడించాయి.

ఈ సమావేశంలో లిక్కర్ కేసు, ఇటీవలి అరెస్టులు, రాష్ట్రంలోని శాంతి భద్రతల పరిస్థితి వంటి అంశాలపై కూడా చర్చ జరిగినట్లు తెలుస్తోంది. ఈ భేటీలో జగన్ గవర్నర్‌కు కొన్ని ముఖ్యమైన డాక్యుమెంట్లు అందజేసినట్టు సమాచారం.

వీటిలో లిక్కర్ కేసుకు సంబంధించి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభిప్రాయాలు, సీబీఐ/ఈడీ దాడుల నేపథ్యంలో తమ పార్టీ నేతలపై జరుగుతున్న దాడులు, అలాగే భారతీ సిమెంట్స్ సంస్థపై ఇటీవల జరిగిన సోదాలు వంటి అంశాలపై వివరణాత్మక వివరాలు ఉన్నట్లు తెలుస్తోంది.

# అతిసార వ్యాధికి అద్భుత ఔషధం ఓఆర్ఎస్ !

## (29 జూలై "ప్రపంచ ఓఆర్ఎస్ దినం" సందర్భంగా)

ప్రపంచ ఆరోగ్య సంస్థ వివరాల ప్రకారం ఐదేండ్ల లోపు పిల్లల మరణాలకు కారణమైన 2వ అతి పెద్ద వ్యాధిగా 'అతిసారం' లేదా 'నీళ్ల విరోచనాలు' లేదా 'డయేరియా'ను గుర్తించారు. పరిసరాలు, వ్యక్తిగత అపరిశుభ్రత కారణంగా ప్రమాదకర, ప్రాణాంతక అతిసార రోగం సోకుతుంది. డయేరియాతో శరీర ద్రవాలు, లవణాల శాతం తగ్గుతూ 'డీహైడ్రేషన్ (నిర్జలీకరణం)' కలుగుతుంది. అతిసార వ్యాధి తీవ్రతను గుర్తించిన అంతర్జాతీయ పౌర సమాజం ప్రతి ఏట 29 జూలై రోజున "ప్రపంచ ఓఆర్ఎస్ దినం" పాటించనట జరుగుతోంది.

భారత్ బాలల్లో అతిసార భారం:

ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఏట 1.7 బిలియన్ల పిల్లలు డయేరియాతో బాధ పడడంతో పాటు 5.25 లక్షల మంది చిన్నారులు ప్రాణాలను కోల్పోవడం గమనిస్తున్నాం. అతిసార వ్యాధి భారత చిన్నారులకు ఒక శాపంగా మారుతున్నది. భారత్‌లో 3వ అతి పెద్ద వ్యాధిగా దాదాపు 13 శాతం పిల్లల మరణాలు డయేరియా వల్ల కలుగుతున్నాయి. ఓఆర్ఎస్ ఘన మిశ్రమంలో పిండి పదార్థం (చక్కర), ఉప్పు ప్రధాన ఔషధాలుగా ఉంటాయి. అభివృద్ధి చెందుతున్న అల్పాదాయ దేశాల్లో దీని తీవ్రత అధికంగా కనిపిస్తున్నది.

చిటికెడు ఓఆర్ఎస్‌తో అతిసారానికి అడ్డుకట్ట:

వ్యాధికి చవకైన ఔషధమే 'ఓఆర్ఎస్' లేదా 'ఓరల్ రీడైడ్రేషన్ సొల్యూషన్ (నోటి పునర్జలీకరణ ద్రావణం)' అని గమనించాలి. దేహంలో సోడియం, పొటాషియం, క్లోరైడ్, బైకార్బొనేట్‌లతో పాటు శరీర ద్రవాలు వాంతులు, నీళ్ల విరోచనాల రూపంలో శరీరం కోల్పోవడంతో ప్రమాదకర పరిస్థితులు వస్తాయి. ఇలాంటి అతిసార వ్యాధికి చికిత్సగా రోజుకు పలు మార్లు చవకైన ఓఆర్ఎస్ పొడిని నీటిలో కలిపి తాగించాల్సి ఉంటుంది. అత్యవసర పరిస్థితుల్లో ఇంట్లో ఉన్న చక్కర, ఉప్పులను చిటికెడు మంచి నీటిలో కలిపి చెంచాతో పిల్లలకు తాగించాలి. వాణిజ్యపరంగా మెడికల్ షాపుల్లో లభించే ఓఆర్ఎస్ మిశ్రమంలో ఉప్పు, ట్రైసోడియం సిట్రేట్, డీహైడ్రేట్, పొటాషియం క్లోరైడ్, షుగర్ నిర్ణీత నిష్పత్తిలో ఉంటాయి. అతిసార వ్యాధి వచ్చినపుడు ఓఆర్ఎస్ మిశ్రమాన్ని నీటిలో కలిపి తరుచుగా తాగించడం వల్ల శరీరానికి అవసరమైన నీరు, లవణాలు, చక్కర్లు సత్వరమే అందించబడి ఆరోగ్యం కుదుట పడుతుంది.

వాంతులు, నీళ్ల విరోచనాల లక్షణాలు కనిపించినపుడు వెంటనే చవకైన ఓఆర్ఎస్ ద్రావణాన్ని తాగించి పిల్లల్ని ప్రాణాపాయ గండం నుంచి గట్టెక్కించవచ్చని అందరూ గమనించాలి. గోరుతో పోయే దానిని గొడ్డలి దాకా తెచ్చుకోవద్దు. అతిసార వ్యాధి సోకినపుడు ఓఆర్ఎస్ ద్రావణాన్ని తాగించని యెడల ప్రాణాపాయంతో ఆసుపత్రిలో గడపాల్సిన వస్తుంది లేదా మరో నిర్లక్ష్యం చేస్తే పిల్లల ప్రాణాలు కూడా పోవచ్చని తెలుసుకుందాం.

–డా: బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# ఖమ్మం, కొత్తగూడెం అభివృద్ధిపై ఉపముఖ్యమంత్రి భట్టి సమీక్ష..




ఖమ్మం, జులై 28:జిల్లాల్లో అమలవుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, వర్షాకాలం నేపథ్యంలో తలెత్తిన సమస్యలపై సమీక్షను ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క నిర్వహించారు. ఈ సమీక్ష ఆదివారం పాల్వంచలోని ఐడీఓసీ సమావేశ మందిరంలో జరిగింది.

సమీక్షలో రాష్ట్ర మంత్రులు వాకాటి శ్రీహరి, తుమ్మల నాగేశ్వర రావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఖమ్మం జిల్లా ఇన్‌చార్జిగా వాకాటి శ్రీహరి, వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ, గృహనిర్మాణ, ఐ అండ్ పీఆర్ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హాజరయ్యారు. జిల్లా కలెక్టర్లు అనుదీప్ దురిశెట్టి (ఖమ్మం), జితేష్ వి పాటిల్ (భద్రాద్రి కొత్తగూడెం) పవర్‌పాయింట్ ద్వారా జిల్లాల పరిస్థితులు, ప్రభుత్వం చేపట్టిన చర్యలపై వివరాలను సమర్పించారు.

సమీక్షలో ప్రధానంగా వరద ముంపు ప్రాంతాల్లో పరిస్థితులు, వర్షాభావ పరిస్థితులు, సీజనల్ వ్యాధుల వ్యాప్తి, వైద్య సేవల లభ్యత, ఎరువుల సరఫరా, రేషన్ కార్డుల పంపిణీ, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, వనమహోత్సవాల నిర్వహణ, విద్యా రంగ అభివృద్ధిపై చర్చ జరిగింది.

ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాటాడుతూ భారీ వర్షాలు, వరదల పరిస్థితిని ఎదుర్కొనేందుకు యాక్షన్ ప్లాన్ సిద్ధంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. ఇందిరా సౌర జల వికాసం పథకంలో భాగంగా గిరిజన రైతులకు సోలార్ పంపులు, డ్రిప్, స్ప్రింక్లర్ పద్ధతులను ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు. ఈ పథకం కోసం వచ్చే మూడు సంవత్సరాల్లో రూ.12,600 కోట్లు వెచ్చించనున్నట్టు పేర్కొన్నారు.

మహిళా సంఘాల ద్వారా చేపల ఉత్పత్తి కేంద్రాలు ఏర్పాటు చేసి చేపల పెంపకాన్ని ప్రోత్సహించనున్నట్లు ఆయన వెల్లడించారు. అలాగే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను ప్రతి జిల్లాలో 25 ఎకరాల స్థలంలో నిర్మించనున్నట్లు తెలిపారు. ఇవి ఇతర పాఠశాలలకు ఆదర్శంగా ఉండేలా అభివృద్ధి చేయాలన్నారు.

మహాలక్ష్మి పథకంలో భాగంగా ఇప్పటివరకు రూ.200 కోట్ల విలువైన ఉచిత బస్సు ప్రయాణాలు మహిళలకు లభించాయని చెప్పారు. అలాగే రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి ప్రయోజనాలను ప్రజలకు అందించినట్లు వివరించారు.

ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇండ్లను మంజూరు చేశామని, వారంవారీగా నిధులు విడుదల చేస్తున్నామని తెలిపారు. మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దేందుకు లక్ష కోట్ల రూపాయల బ్యాంకు రుణాల లింకేజ్ కల్పించేందుకు ప్రణాళిక రూపొందించినట్టు ఆయన తెలిపారు.

## మాల్దీవుల 60వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు గౌరవ అతిథిగా హాజరైన ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, జులై 28:మాల్దీవుల దేశంలో అధికారిక పర్యటనలో ఉన్న ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈరోజు ఆ దేశ 60వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు గౌరవ అతిథిగా హాజరయ్యారు. ఆ దేశ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు భారత ప్రధానమంత్రి హాజరు కావడం ఇదే మొదటిసారి. అధ్యక్షుడు ముయిజు ఆతిథ్యం ఇచ్చిన ప్రభుత్వాధినేత లేదా దేశ నాయకుడు కూడా ప్రధాని మోదీనే కావటం విశేషం.

రిపబ్లిక్ స్క్వేర్‌లో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ కవాతును మాల్దీవుల అధ్యక్షుడు డాక్టర్ మొహమ్మద్ ముయిజుతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వీక్షించారు. ఈ సందర్భంగా ఆ దేశ ప్రజలకు, ప్రభుత్వానికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. మాల్దీవుల జాతీయ రక్షణ దళాలు, ఇతర స్థానిక సాయుధ దళాలు నిర్వహించిన ఉత్సాహభరితమైన కవాతు, సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఆధునిక దేశంగా మాల్దీవులు సాధించిన విజయాలను ఇవి తెలియజేశాయి.

తనకు లభించిన సాదర ఆహ్వానానికి అధ్యక్షుడితో పాటు ఆ దేశ ప్రజలకు ప్రధానమంత్రి కృతజ్ఞతలు తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో గౌరవ అతిథిగా మోదీ పాల్గొనడం రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలలో ఒక కీలక ఘట్టంగా నిలిచిపోతుంది. భారత్, మాల్దీవుల మధ్య దౌత్య సంబంధాలు 2025తో 60 సంవత్సరాలు పూర్తయ్యాయి.

# భారత సైన్యం ఆధ్వర్యంలో కార్గిల్ విజయ్ దివస్ 26వ వార్షికోత్సవం

న్యూఢిల్లీ, జులై 28:దేశ వ్యాప్తంగా అందరూ 26వ కార్గిల్ విజయ్ దివస్ వార్షికోత్సవాన్ని జరుపుకుంటున్నారు. కార్గిల్ యుద్ధంలో సైనికుల శౌర్యం, అత్యున్నత త్యాగాలను గౌరవిస్తూ భారత సైన్యం దేశవ్యాప్త భాగస్వామ్యంతో సగర్వంగా కార్గిల్ విజయ దివస్ వేడుకలను నిర్వహించింది. రెండు రోజుల పాటు ద్రాస్‌లోని కార్గిల్ యుద్ధ స్మారక చిహ్నం వద్ద జరిగిన ప్రధాన కార్యక్రమానికి కార్మిక – ఉపాధి, యువజన వ్యవహారాలు – క్రీడల శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ, రక్షణ శాఖ సహాయ మంత్రి శ్రీ సంజయ్ సేథ్, లడఖ్ లెఫ్టినెంట్ గవర్నర్ శ్రీ కవిందర్ గుప్తా, ఆర్మీ స్టాఫ్ చీఫ్ (సీఓఏఎస్) జనరల్ ఉపేంద్ర ద్వివేది హాజరయ్యారు. సైనిక దళాల సీనియర్లు, పౌర ప్రముఖులు ఈ సందర్భంగా నివాళులు అర్పించారు. అమరవీరుల జ్ఞాపకార్థం 545 దీపాలను వెలిగించారు. వీర నారులు, ప్రాణ త్యాగం చేసిన చేసిన వారి బంధువులను సత్కరించారు. భారత్, నేపాల్ వ్యాప్తంగా ఉన్న 545 మంది అమరవీరుల కుటుంబాలను సైన్యం కలిసింది. ఇండస్ వ్యూపాయింట్, ఈ–శ్రద్ధాంజలి పోర్టల్, క్యూఆర్ ఆధారిత ఆడియో గేట్‌వే వంటి సాంస్కృతిక ప్రాజెక్టులను సీఓఏఎస్ జనరల్ ఉపేంద్ర ద్వివేది ప్రారంభించారు. ఆధునికీకరణ, స్వావలంబన దిశగా మొబిలిటీ, నిఘా, ఆయుధ శక్తిలో అత్యాధునిక స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానానికి సంబంధించిన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు, మతపరమైన ప్రార్థనలు, చర్చాపూర్వక కార్యక్రమాలు దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన సైనికులతో ఉన్న లోతైన భావోద్వేగ సంబంధాన్ని తెలియజేశాయి.

ద్రాస్‌లోని లామోచెన్ వ్యూపాయింట్‌లో యుద్ధ వివరాలను గుర్తు చేసుకోవటంతో కార్యక్రమం ప్రారంభమైంది. కార్గిల్ వివాదం జరిగిన అదే పర్వత శిఖరాలను చూస్తూ మాజీ సైనికులు, ప్రస్తుతం విధుల్లో ఉన్న వారు తమ అనుభవాలను గుర్తుకు తెచ్చుకున్నారు. త్యాగం, ధైర్యం, మనోధైర్యానికి సంబంధించిన కథకు జీవం పోస్తూ ఉత్తేజకరమైన దృశ్య శ్రవణ ప్రదర్శనను ఈ సందర్భంగా ఏర్పాటు చేశారు.

ఆ తర్వాత రక్షణ శాఖ సహాయ మంత్రి శ్రీ సంజయ్ సేథ్ సమక్షంలో గౌరవ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ కార్గిల్ యుద్ధ వీరుల బంధువులను సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన.. వారి అచంచల ధైర్యసాహసాలు, త్యాగాలను గుర్తు చేశారు. ఐక్యత, కృతజ్ఞతా భావాన్ని తెలియజేసేలా విజయ్ భోజ్ అనే స్మారక సంయుక్త భోజనం కార్యక్రమంలో ప్రముఖులంతా పాల్గొన్నారు. సైనికులు, ఎన్‌సీసీ కేడెట్లు, ఆర్మీ గుడ్‌విల్ పాఠశాలల విద్యార్థుల ఉత్సాహభరితమైన ప్రాంతీయ సాంస్కృతిక ప్రదర్శనల్లో దేశభక్తిని ప్రదర్శించారు. కార్యక్రమానికి ప్రధాన ఆకర్షణగా నిలుస్తూ? స్వార్మ్ డ్రోన్‌లు, రవాణా డ్రోన్‌లు, ఎఫ్‌పీవీ డ్రోన్‌లు వంటి వాటితో సాంకేతిక ప్రదర్శనలు జరిగాయి. ఎత్తైన భూభాగాల్లో అత్యాధునిక సాంకేతిక ఆయుధాలను, పరిష్కారాలను ఉపయోగిస్తూ సైన్యం సంసిద్ధంగా ఉండటాన్ని ఇది తెలియజేసింది.

సాయంత్రం కార్గిల్ యుద్ధ స్మారక చిహ్నం వద్ద అమరులైన వారికి హృదయపూర్వక నివాళిగా 'శౌర్య సంధ్య' కార్యక్రమం జరిగింది. సంగీతంతో వీరత్వ గాథలను తెలియజేస్తూ ఆర్మీ బ్యాండ్ చేపట్టిన 'గౌరవ గాథ' ప్రదర్శనతో ఈ కార్యక్రమం ప్రారంభమైంది. జాతి ఐక్యతను ప్రతిబింబిస్తూ అన్ని ప్రధాన మత విశ్వాసాలకు చెందిన ఐదుగురు గురువులు.. అమరవీరుల కోసం ప్రార్థనలు చేశారు. ఆపరేషన్ విజయ్‌లో తన ప్రాణాలను అర్పించిన సైనికులను సూచించేలా మొత్తం 545 దీపాలను వెలిగించారు.

ప్రాణాలు త్యాగం చేసిన తొమ్మిది మంది వీరుల దగ్గరి బంధువులను తూర్పు కమాండ్ జనరల్ కమాండింగ్ ఆఫీసర్ ఇన్ ఛీఫ్, లెఫ్టినెంట్ జనరల్ ప్రతీక్ శర్మ సత్కరించారు. ఇది ఈ సాయంత్రానికి అత్యంత కృతజ్ఞతాపూర్వక క్షణంగా నిలిచింది. పౌర, సైనిక ప్రముఖులు.. వీర నారులు, వీర మాతలు, స్థానిక ప్రజలు సహా 400 మందికి పైగా విశిష్ట అతిథులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

కార్గిల్ యుద్ధ స్మారక చిహ్నం వద్ద పుష్పగుచ్ఛాలను సమర్పించటంతో ప్రధాన కార్యక్రమం ప్రారంభమైంది. గౌరవ కార్మిక – ఉపాధి, యువజన వ్యవహారాల – క్రీడల మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ.. గౌరవ రక్షణ శాఖ సహాయ మంత్రి శ్రీ సంజయ్ సేథ్.. గౌరవ లడఖ్ లెఫ్టినెంట్ గవర్నర్ శ్రీ కవిందర్ గుప్తా.. సీఓఏఎస్ జనరల్ ఉపేంద్ర ద్వివేది మొదట అమరులకు నివాళులు అర్పించారు. అనంతరం సీనియర్ సైనిక అధికారులు, శౌర్య అవార్డు గ్రహీతలు, వీర నారులు, యుద్ధంలో మరణించిన వారి కుటుంబ సభ్యులు నివాళులు అర్పించారు. భావోద్వేగాలను రేకెత్తిస్తూ, జ్ఞాపకాలను గుర్తు చేస్తూ "లాస్ట్ పోస్ట్" ధ్వని లోయ అంతటా ప్రతిధ్వనించింది.

సీఓఏఎస్ జనరల్ ఉపేంద్ర ద్వివేది కీలకోపన్యాసం చేశారు. కార్గిల్ యుద్ధంలో ప్రాణాలర్పించిన సైనికులకు హృదయపూర్వక నివాళులు అర్పిస్తున్నట్లు తెలిపారు. వారి అచంచల ధైర్యాన్ని , త్యాగాన్ని కొనియాడారు. 1999లో భారత సైన్యం సాధించిన చరిత్రాత్మక విజయం, ఇటీవలి ఆపరేషన్ సిందూర్ సందర్భంగా దేశ సార్వభౌమత్వాన్ని దృఢంగా కాపాడిన తీరును ఆయన గుర్తు చేశారు. భారత్ శాంతిని కోరుకుంటుందని, అయితే రెచ్చగొట్టే చర్యలకు నిర్ణయాత్మకంగా స్పందిస్తుందని ప్రధానంగా చెబుతూ.. ప్రజలకు ఎలాంటి హాని కలిగించకుండా ఉగ్రవాద మౌలిక సదుపాయాలపై సైన్యం ఖచ్చితత్వంతో విజయవంతంగా దాడి చేసిందని అన్నారు. 'రుద్ర' ఆల్ ఆర్మ్స్ బ్రిగేడ్‌లు, 'భైరవ్' తేలికపాటి కమాండో బెటాలియన్లు, 'శక్తిబాన్' శతఘ్ని రెజిమెంట్లు, 'దివ్యాస్త్ర' బ్యాటరీలు, డ్రోన్లతో ఉన్న పదాతిదళ బెటాలియన్లు, స్వదేశీ వైమానిక రక్షణ వ్యవస్థల ద్వారా భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న శక్తిగా సైన్యం రూపాంతరం చెందడాన్ని సీఓఏఎస్ వివరించారు. జాతి నిర్మాణంలో ముఖ్యంగా సరిహద్దు మౌలిక సదుపాయాలు, పర్యాటకం, ఆర్థిక వ్యవస్థ, మాజీ సైనికుల సంక్షేమంలో సైన్యం పోషిస్తోన్న పాత్రను ఆయన ప్రశంసించారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్‌ను తయారు చేయటంలో సైనికుల పాత్ర ఎప్పటికీ ఉంటుందని అన్నారు. నిజాయితీ, అంకితభావంతో దేశానికి సేవ చేయాలని యువతకు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. దేశ ఐక్యత, సార్వభౌమాధికారం, గౌరవాన్ని కాపాడటానికి దృఢమైన నిబద్ధతతో ఉన్నట్లు తెలియజేస్తూ తన ప్రసంగాన్ని ముగించారు.

ఆధునికీకరణ, కార్యాచరణ సంసిద్ధతతో పాటు ముఖ్యంగా ఎత్తయిన ప్రాంతాల్లో యుద్ధానికి సంబంధించిన సామర్థ్య ప్రదర్శన కార్యక్రమాన్ని భారత సైన్యం నిర్వహించింది. "సాంకేతిక సౌలభ్యం: గ్రహించు, ఆవిష్కరించు, ఏకీకృతం"

అనే ఇతివృత్తం కింద జరిగిన ఈ ప్రదర్శన చలనశీలత, నిఘా, ఆయుధ సామర్థ్యం, పదాతిదళ వ్యవస్థలలో పురోగతిని ప్రధానంగా తెలియజేసింది.

ద్రాస్ పర్వత శిఖరాల వెనుక సూర్యుడు అస్తమిస్తుండగా దేశ గౌరవాన్ని, త్యాగానికి చిహ్నంగా కార్గిల్ యుద్ధ స్మారకం.. త్రివర్ణ పతాక రంగుల్లో ప్రకాశించింది. 26వ కార్గిల్ విజయ్ దివాస్ కేవలం చరిత్రకు సంబంధించినది మాత్రమే కాదు, సైనికులు ఎప్పటికి దేశ ఆత్మలో శాశ్వతంగా ఉంటారని తెలియజేయటమే.

# శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం..

## –మూడు గేట్లు ఎత్తి నీటి విడుదల

నంద్యాల ,జులై 28: నంద్యాల జిల్లా లోని శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం రోజు రోజుకు పెరుగుతూ వస్తుంది. జూలై 28 సోమవారం అధికారులు మరో రెండు గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేసారు. మధ్యాహ్నం 12గంటలకు మరో గేటు ఎత్తేసారు. ప్రస్తుతం మూడు గేట్ల ద్వారా నీటిని నాగార్జున సాగర్ కు విడుదల చేస్తున్నారు. ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు వరదలా వస్తోన్న నీరు శ్రీశైలం జలాశయానికి ఎత్తేసిన గేట్ల ద్వారా ప్రవాహం పరవళ్ళు తొక్కుతోంది.

జూరాల, సుంకేసుల ప్రాజెక్టుల నుంచి శ్రీశైలం జలాశయానికి 1,27,392 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. శ్రీశైలం నుంచి ఔట్ ఫ్లో 1,40,009 క్యూసెక్కులు. రెండు స్పిల్‌వే గేట్ల ద్వారా 53,764 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటరీ నుంచి 20 వేల క్యూసెక్కులు, ఎడమ గట్టు విద్యుత్ కేంద్రం నుంచి 35,315 క్యూసెక్కులు, కుడిగట్టు విద్యుత్ కేంద్రం నుంచి 30,930 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా.. ప్రస్తుతం 882.40 అడుగులకు చేరింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 215.80 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 201.12 టీఎంసీలుగా నమోదైంది. పర్యాటకుల సందడి అధికమైంది. పర్యాటకుల రాకతో శ్రీశైలం పులకరించిపోతుంది.

పర్యాటకులు జాగ్రత్తగా ఉండాలి..

పరవళ్ళు తొక్కుతున్న ప్రవాహంతో కళకళలాడుతున్న శ్రీశైలం జలాశయం వద్ద పర్యాటకుల సందడి పెరుగుతోంది. అయితే అంతటా నీటి తడి బాగా ఉండడం వల్ల ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా, జారి పడిపోయే ప్రమాదం ఉంటుంది. అంతే కాక, సెల్ఫీల కోసం, రీల్స్ కోసం జలాశయం దగ్గరికి వెళ్ళి ప్రమాదకరంగా ప్రవర్తించవద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు. ఒక్కోసారి ప్రవాహ ఉధృతిలో కొట్టుకుపోతే చాలా కష్టం. అందుకే పిల్లలు, పెద్దవాళ్ళు చాలా జాగ్రత్తగా వ్యవహరించాలని కోరుతున్నారు అధికారులు. ప్రకృతి శోభను తిలకించడానికి వచ్చిన పర్యటన సంతోషంగా ముగిస్తే బాగుంటుంది కానీ విషాదాంతం చేసుకోవద్దని అధికారులు పదే పదే హెచ్చరిస్తున్నారు.

# షటిల్ ఆడుతూ గుండెపోటుతో కుప్పకూలి..

హైదరాబాద్, జులై 28: ఆటల్లో ప్రతి ఒక్కరి పరమావధీ గెలుపే. ఎన్ని సవాళ్లైనా స్వీకరించి, ఓటములను భరించి విజయతీరాలకు చేరుకోవాలని ప్రతి ఒక్క క్రీడాకారుడూ తపిస్తుంటాడు.

దానికి తగినట్లే క్రీడామైదానాల్లో పడిపోవడాలూ–దెబ్బలు తగిలించుకోవడాలూ సర్వసాధారణమే. అలాంటి సందర్భాల్లో స్వల్ప విరామం తీసుకుని తిరిగి బరిలో నిలుస్తారు.. గాయం మరీ తీవ్రమైనది అయితే.. ఆట నుంచి నిష్క్రమించవలసిందే..

అయితే శరీరానికైన గాయం చిన్నదో.. పెద్దదో పైకి కనిపిస్తుంది కానీ, ఒక్కోసారి క్రీడాకారులు ఆటలో–గెలుపుకోసం పడే టెన్షన్–ఒత్తిడి తీవ్రం అయితే అది గుండెమీద ప్రభావం చూపుతుంది.

అందుకే క్రీడాకారులు ఇలాంటి వషయంలో చాలా జాగ్రత్తగా వ్యవహరించాలి. ఒత్తిడికి దూరంగా ఉండాలి. అప్పుడే బాగా ఆడగలుగుతారు. అంతేకాక గుండెమీద పడే ఒత్తిడి నుంచి కూడా తప్పించుకోగలుగుతారు. శరీరం బాగా స్ట్రెయిన్ అవుతున్న సమయంలోనే మనసు కూడా ఒత్తిడికి గురవుతే ఎంత ప్రమాదమో, ఒక్కోసారి ప్రాణాల మీదకు ఎలా వస్తుందో ఈ సంఘటన చూసినప్పుడు తెలుస్తుంది.

ఇటీవల కాలంలో గుండెపోటు మరణాలు ఎక్కువ అవడంతో ఆందోళనకు గురిచేస్తున్నాయి. వయసుతో సంబంధం లేకుండా చిన్న పిల్లల దగ్గర్నుంచి పెద్ద వాళ్ల వరకు గుండెపోటుకు గురై ప్రాణాలు కోల్పోతున్నారు. అప్పటి వరకు ఎంతో ఉల్లాసంగా కనిపించిన వారు క్షణాల్లోనే విలవిల్లాడుతూ కుప్పకూలుతున్నారు. ఆసుపత్రికి తరలించే లోపే తుదిశ్వాస విడుస్తున్నారు.

తాజాగా నాగోల్ లో విషాదం చోటుచేసుకుంది. ఓ 25 ఏళ్ల యువకుడు షటిల్ ఆడుతూ గుండెపోటుతో కుప్పకూలిపోయాడు. అక్కడే ఉన్న కొందరు యువకులు సీపీఆర్ చేసినా ప్రయోజనం లేకుండా పోయింది.

నాగోల్ స్టేడియంలో షటిల్ ఆడుతుండగా ఒక్కసారిగా కుప్పకూలి పడిపోయాడు రాకేష్ (ఖీజీనివబష్త్ర) అనే యువకుడు. వెంటనే స్పందించిన అక్కడున్న యువకులు ఆసుపత్రికి తరలించారు.

పరీక్షించిన వైద్యులు అప్పటికే మరణించినట్లు నిర్ధారించారు. మృతుడు ఖమ్మం జిల్లా తల్లాడ మాజీ ఉప సర్పంచ్ గుండ్ల వెంకటేశ్వర్లు కుమారుడు గుండ్ల రాకేష్(25) గా గుర్తించారు. రాకేష్ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నట్లు సమాచారం. కొడుకు మృతితో కుటుంబంలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి.

## మత్స్య, ఆక్వాకల్చర్ రంగాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని పెంపొందించేందుకు అవగాహన ఒప్పందం చేసుకున్న భారత్, మాల్దీవులు

న్యూఢిల్లీ, జులై 28:మత్స్య, ఆక్వాకల్చర్ రంగాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని పెంపొందించడానికి భారత మత్స్య, పశుసంవర్ధక, పాడిపరిశ్రమ మంత్రిత్వ శాఖ పరిధిలోని మత్స్య శాఖ.. మాల్దీవుల మత్స్య, సముద్ర వనరుల మంత్రిత్వ శాఖలు అవగాహన ఒప్పందంపై (ఎంఓయూ) సంతకాలు చేశాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ. మాల్దీవులు అధికారిక పర్యటనలో భాగంగా 2025 జూలై 25న కుదిరిన 6 ఒప్పందాల్లో ఇది ఒకటి. ట్యూనా, సముద్రాల్లో లోతున జీవించే మత్స్య సంపద పెంపకాన్ని ప్రోత్సహించడం.. ఆక్వాకల్చర్, వనరుల సుస్థిర నిర్వహణను బలోపేతం చేయడం.. మత్స్య ఆధారిత పర్యావరణ పర్యాటకాన్ని ప్రోత్సహించడం.. రెండు దేశాలలో ఆవిష్కరణ, శాస్త్రీయ పరిశోధనలకు మద్దతునివ్వాలని ఈ ఒప్పందం లక్ష్యంగా పెట్టుకుంది.

విలువ ఆధారిత గొలుసు (వ్యాల్యూ చైన్) అభివృద్ధి, సముద్ర రంగ పురోగతి, వాణిజ్యాన్ని సులభతరం చేయటం, మత్స్య రంగంలో సామర్థ్యాల పెంపు వంటి ముఖ్యమైన అంశాల్లో సహకారం ఈ ఒప్పందంలో కీలకంగా ఉంది. శీతలీకరణ నిల్వకు సంబంధించిన మౌలిక సదుపాయాలలో పెట్టుబడులు పెట్టటం.. హేచరీల అభివృద్ధి, ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచటం, మత్స్య జాతుల వైవిధ్యకరణ ద్వారా ఆక్వాకల్చర్ రంగాన్ని బలోపేతం చేస్తూ మాల్దీవులు... చేపల ప్రాసెసింగ్ సామర్థ్యాలను పెంచుకోనుంది. జలచరాల ఆరోగ్యం, బయోసెక్యూరిటీ పరీక్షలు, ఆక్వాకల్చర్ ఫామ్‌ల నిర్వహణ, శీతలీకరణ, మెకానికల్ ఇంజనీరింగ్, మెరైన్ ఇంజనీరింగ్ వంటి ప్రత్యేక సాంకేతిక రంగాలలో సామర్థ్య పెంపుపై దృష్టి సారిస్తూ దీర్ఘకాలిక నైపుణ్యాల అభివృద్ధికి తోడ్పడేలా శిక్షణ, విజ్ఞాన మార్పిడి కార్యక్రమాల నిర్వహణకు ఈ ఎంఓయూ వెసులుబాటు కల్పించింది.

# ఏపీలో పెట్టుబడులకు పెద్ద ఎత్తున అవకాశాలు!

## సింగపూర్ పర్యటనలో సీఎం చంద్రబాబు




అమరావతి, జులై 28:సింగపూర్ పర్యటనలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పలువురు ప్రముఖులను కలిశారు. భారత హైకమిషనర్ డాక్టర్ శిల్పక్ ఆంబులేతో పాటు టౌన్‌షిప్ గ్లోబల్ లీడ్ లో చేర్ ఎక్, ఎవర్‌సెండై ఇంజినీరింగ్ ఎక్స్‌క్యూటివ్ చైర్మన్ టాన్ శ్రీ డాటో ఎ.కె. నాథన్‌తో సమావేశమయ్యారు. ఏపీలో పెట్టుబడులకు అనుకూల వాతావరణం ఉందని తెలిపారు.

గ్రీన్ ఎనర్జీ, పోర్టులు, హెల్త్, డిఫెన్స్, ఐటీ, సెమికండక్టర్లు, ఏవియేషన్ వంటి రంగాల్లో పెట్టుబడులకు ఏపీ సిద్ధంగా ఉందని, ఇప్పటికే విశాఖలో గూగుల్ డేటా సెంటర్, కాకినాడలో గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టు, అమరావతిలో క్వాంటం వ్యాలీని ఏర్పాటు చేస్తున్నట్టు సీఎం వెల్లడించారు.

సింగపూర్ కంపెనీలకు పాలసీలు, సహకారం సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. గతంలో అమరావతి రాజధాని ప్రాజెక్టులో సింగపూర్ భాగస్వామ్యం గుర్తు చే



# తమిళనాడు తూత్తుకుడిలో రూ. 4800 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసిన ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ

న్యూఢిల్లీ, జులై 28:తమిళనాడులోని తూత్తుకుడిలో రూ. 4800 కోట్లకు పైగా విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈరోజు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. పలు ప్రాజెక్టులను జాతికి అంకితం చేశారు. ప్రాంతీయంగా అనుసంధానాన్ని విశేషంగా మెరుగుపరచడంతోపాటు.. రవాణా రంగ సామర్థ్యాన్ని పెంచేలా, శుద్ధ ఇంధన మౌలిక సదుపాయాలను బలోపేతం చేసేలా వివిధ రంగాల్లో వరుసగా చేపట్టిన పలు కీలక ప్రాజెక్టులు తమిళనాడు ప్రజల జీవన ప్రమాణాలను పెంచుతాయి. కార్గిల్ విజయ దివస్ సందర్భంగా కార్గిల్ వీర సైనికులకు శ్రీ మోదీ నివాళి అర్పించారు. సాహసికులైన వీరయోధులకు ప్రణమిల్లారు. దేశం కోసం ప్రాణత్యాగానికీ వెనుకాడని అమరులకు మనఃపూర్వకంగా అంజలి ఘటించారు.

సభనుద్దేశించి ప్రసంగిస్తూ.. నాలుగు రోజుల విదేశీ పర్యటన ముగిసిన వెంటనే నేరుగా శ్రీ రామేశ్వర పుణ్యక్షేత్రానికి చేరుకోవడం తన భాగ్యమని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అన్నారు. విదేశీ పర్యటన సందర్భంగా భారత్ ? బ్రిటన్ మధ్య కుదిరిన చరిత్రాత్మక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని ఆయన ప్రముఖంగా పేర్కొన్నారు. ప్రపంచానికి భారత్ పట్ల పెరుగుతున్న నమ్మకానికి, దేశ పునరుత్తేజానికి ఇది నిదర్శనమన్నారు. ఈ ఆత్మవిశ్వాసమే అభివృద్ధి చెందిన భారత్‌ను, అలాగే అభివృద్ధి చెందిన తమిళనాడును సాకారం చేస్తుందని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు. భగవాన్ రామేశ్వరుడు, తిరుచెందూర్ మురుగన్ ఆశీస్సులతో అభివృద్ధిలో ఓ కొత్త అధ్యాయం నేడు తూత్తుకుడిలో మొదలవుతోందన్నారు. "తమిళనాడును అభివృద్ధిలో శిఖరాగ్రంలో నిలిపే దిశగా 2014లో ప్రారంభించిన కార్యక్రమం నేటికీ తూత్తుకుడిలో కొనసాగుతోంది" అని ప్రధానమంత్రి పేర్కొన్నారు.

గతేడాది ఫిబ్రవరిలో వి.వొ. చిదంబరనార్ ఓడరేవులో ఔటర్ హార్బర్ కంటైనర్ టెర్మినల్ శంకుస్థాపనను గుర్తుచేసుకుంటూ.. ఆ పర్యటన సందర్భంగా రూ. వందల కోట్ల విలువైన పలు ప్రాజెక్టులను ప్రారంభించిన విషయాన్ని శ్రీ మోదీ ప్రముఖంగా ప్రస్తావించారు. అదే ఏడాది సెప్టెంబరులో కొత్తగా తూత్తుకుడి అంతర్జాతీయ కంటైనర్ టెర్మినల్‌ను కూడా ప్రారంభించిన విషయాన్ని గుర్తుచేసుకున్నారు. నేడు మరోసారి తూత్తుకుడిలో రూ. 4,800 కోట్ల విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. విమానాశ్రయాలు, రహదారులు, ఓడరేవులు, రైల్వేలు, విద్యుత్ రంగంలో పురోగతి సహా పలు కీలక రంగాల్లో ఈ కార్యక్రమాలు చేపట్టినట్టు ప్రధానమంత్రి వివరించారు. విశేష అభివృద్ధిని సాధించిన తమిళనాడు ప్రజలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

"మౌలిక సదుపాయాలు, ఇంధన రంగాలు ఏ రాష్ట్ర అభివృద్ధికైనా వెన్నెముకగా నిలుస్తాయి. గత పదకొండేళ్లుగా ఈ రంగాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నాం. తమిళనాడు పురోగతిపట్ల మా ప్రాధాన్యానికి ఇది అద్దం పడుతుంది" అని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. నేడు ప్రారంభించిన ప్రాజెక్టులు తూత్తుకుడినీ తమిళనాడునూ అత్యుత్తమ రవాణా, పర్యావరణ హిత ఇంధన, నూతన అవకాశాల నిలయంగా తీర్చిదిద్దుతాయని ఆయన పేర్కొన్నారు.

సుసంపన్నమైన తమిళనాడు, తూత్తుకుడి సాంస్కృతిక, చారిత్రక వారసత్వాన్ని శ్రీ మోదీ శ్లాఘించారు. బలమైన, సుసంపన్నమైన భారత్ నిర్మాణంలో ఈ ప్రాంతం చిరస్మరణీయమైన పాత్ర పోషించిందని కొనియాడారు. వలస పాలన కాలంలో సముద్ర వాణిజ్య సామర్థ్యాన్ని ముందుగానే గుర్తించి.. దేశీయంగా నౌకా రవాణా వెంచర్లను ప్రారంభించి బ్రిటిష్ ఆధిపత్యాన్ని సవాలు చేసిన దార్శనికుడైన స్వాతంత్ర్య సమరయోధుడు శ్రీ వి.వొ. చిదంబరం పిళ్లైని ఈ సందర్భంగా స్మరించుకున్నారు. వీరత్వమూ దేశభక్తి కలిగిన స్వతంత్రమైన, శక్తిమంతమైన భారత్‌ను స్వప్నించి, పోరాడిన వీరపాండ్య కట్టబ్రహ్మన, అళగు ముత్తు కోన్ వంటి యోధుల కృషినీ ప్రధానమంత్రి కీర్తించారు. జాతీయ కవి సుబ్రమణియ భారతి జన్మస్థలమూ తూత్తుకుడి సమీపంలోనే ఉందన్న శ్రీ మోదీ.. తూత్తుకుడికీ తన సొంత నియోజకవర్గం కాశీకీ మధ్య బలమైన భావోద్వేగ సంబంధముందని వివరించారు. కాశీ-తమిళ సంగమం వంటి సాంస్కృతిక కార్యక్రమాలు భారత ఉమ్మడి వారసత్వాన్నీ ఐక్యతనూ నిరంతరం బలోపేతం చేస్తాయని వ్యాఖ్యానించారు.

ప్రసిద్ధ తూత్తుకుడి ముత్యాలను గతేడాది తాను శ్రీ బిల్ గేట్స్‌కు బహూకరించానని, ఆయన వాటినెంతో అభినందించారని ప్రధానమంత్రి గుర్తుచేసుకున్నారు. ఈ ప్రాంతంలోని పాండ్య ముత్యాలు ఒకప్పుడు ప్రపంచవ్యాప్తంగా భారత ఆర్థిక శక్తిని చాటాయన్నారు.

"నిరంతర కృషితో అభివృద్ధి చెందిన తమిళనాడు, అభివృద్ధి చెందిన భారత్ లక్ష్యం దిశగా భారత్ పురోగమిస్తోంది" అని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు. భారత్ ? బ్రిటన్ మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) ఈ లక్ష్యాన్ని మరింత వేగవంతం చేస్తుందన్నారు. ఎఫ్‌టీఏ భారత ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంతోపాటు ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించే దిశగా దేశ ప్రయాణాన్ని వేగవంతం చేస్తుందని శ్రీ మోదీ పేర్కొన్నారు. "నేడు ప్రపంచం భారత పురోగతిలో తన అభివృద్ధిని చూస్తోంది" అన్నారు.

స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం తర్వాత బ్రిటన్‌లో విక్రయించే 99శాతం భారతీయ ఉత్పత్తులపై పన్ను ఉండబోదని ప్రధానమంత్రి పేర్కొన్నారు. బ్రిటన్‌లో భారతీయ వస్తువులు మరింత అందుబాటు ధరలకే లభించడంతో వాటికి డిమాండ్ పెరుగుతుందని, ఇది దేశంలో తయారీ అవకాశాలను పెంచుతుందని ఆయన వివరించారు. భారత్ – బ్రిటన్ ఎఫ్‌టీఏ తమిళనాడు యువత, చిన్న పరిశ్రమలు, ఎంఎస్ఎంఈలు, అంకుర సంస్థలకు కూడా ఎంతగానో ప్రయోజనం చేకూరుస్తుందని శ్రీ మోదీ చెప్పారు. పరిశ్రమలు, మత్స్యకారులు, పరిశోధన – ఆవిష్కరణ వంటి రంగాలకు ఈ ఒప్పందం ఎంతగానో సహకరిస్తుందని, విస్తృతంగా లాభాలను అందిస్తుందని తెలిపారు.

మేకిన్ ఇండియా, మిషన్ మాన్యుఫ్యాక్చరింగ్‌కు ప్రభుత్వం విస్తృత ప్రాధాన్యమిస్తోందని ప్రధానమంత్రి చెప్పారు. మేకిన్ ఇండియా శక్తిని ఆపరేషన్ సిందూర్ స్పష్టంగా చాటిందన్నారు. ఉగ్రవాద స్థావరాలను మట్టుబెట్టడంలో దేశీయంగా తయారు చేసిన ఆయుధాలు కీలక పాత్ర పోషించాయని తెలిపారు. భారత్‌లో తయారైన ఆయుధాలు ఉగ్రవాద సూత్రధారుల్లో ఎప్పటికప్పుడు అలజడి రేపుతూనే ఉన్నాయని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు.

తమిళనాడులో మౌలిక సదుపాయాలను ఆధునికీకరించడం ద్వారా రాష్ట్ర పూర్తి సామర్థ్యాన్ని ఆవిష్కరించే దిశగా.. కేంద్ర ప్రభుత్వం పూర్తి అంకితభావంతో ఉందని శ్రీ మోదీ స్పష్టం చేశారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానాలతో ఓడరేవులను ఉన్నతీకరిస్తూ గణనీయమైన పురోగతి సాధిస్తున్నట్లు పేర్కొన్నారు. మరోవైపు విమానాశ్రయాలు, రహదారులు, రైల్వేలను అనుసంధానిస్తూ.. రాష్ట్రవ్యాప్తంగా అంతరాయం లేకుండా అనుసంధానాన్ని మెరుగుపరిచే ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. తూత్తుకుడి విమానాశ్రయంలో సరికొత్త అధునాతన టెర్మినల్ ప్రారంభం ఈ దిశగా మరో ప్రధాన ముందడుగు అని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. రూ. 450 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ టెర్మినల్ ఇప్పుడు ఏటా 20 లక్షల ప్రయాణికులకు ఆతిథ్యమిచ్చేలా సన్నద్ధమైందన్నారు (గతంలో ఇందులో ప్రయాణికుల సామర్థ్యం 3 లక్షలుగా ఉండేది).

కొత్తగా ప్రారంభించిన టెర్మినల్ దేశంలోని వివిధ గమ్యస్థానాలతో తూత్తుకుడిని విశేషంగా అనుసంధానిస్తుందన్న శ్రీ మోదీ.. ఇది తమిళనాడు వ్యాప్తంగా కార్పొరేట్ ప్రయాణ, విద్యా కేంద్రాలు, ఆరోగ్య రక్షణ కేంద్రాలకు అమితంగా ప్రయోజనం చేకూరుస్తుందని పేర్కొన్నారు. అంతేకాకుండా రవాణా సదుపాయాలు మెరుగుపడడంతో ఈ ప్రాంత పర్యాటక సామర్థ్యంలో నవోత్తేజం నిండుతుందన్నారు.

తమిళనాడులో రెండు ప్రధాన రహదారి ప్రాజెక్టులను ప్రజలకు అంకితం చేస్తున్నట్లు ప్రధానమంత్రి ప్రకటించారు. రెండు కీలకమైన అభివృద్ధి జోన్లను చెన్నైతో అనుసంధానించేలా దాదాపు రూ. 2,500 కోట్ల పెట్టుబడితో ఈ రహదారులను అభివృద్ధి చేశారు. రోడ్లు మెరుగుపడడంతో డెల్టా జిల్లాలకు రాష్ట్ర రాజధానికీ మధ్య అనుసంధానం విశేషంగా పెరిగిందని, దాంతో ఆర్థిక ఏకీకరణతోపాటు ప్రజలకు నగరం మరింత చేరువయిందని అన్నారు.

ఈ రోడ్డు ప్రాజెక్టులు తూత్తుకుడి ఓడరేవుతో కనెక్టివిటీని విశేషంగా పెంచాయని శ్రీ మోదీ తెలిపారు. దీంతో ఈ ప్రాంత ప్రజలకు జీవన సౌలభ్యం పెరుగుతుందన్నారు. వాణిజ్యం, ఉపాధిలో కొత్త అవకాశాలూ లభిస్తాయని ఆశాభావం వ్యక్తపరిచారు.

పారిశ్రామిక వృద్ధికి, ఆత్మనిర్భర భారత్‌కు రైల్వే వ్యవస్థను జీవనాడిగా కేంద్ర ప్రభుత్వం పరిగణిస్తోందని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. గత పదకొండేళ్లుగా దేశ రైల్వే మౌలిక సదుపాయాలు ఆధునికీకరణ దశకు చేరాయని, తమిళనాడు ఇందుకు కేంద్రంగా ఎదిగిందని చెప్తూ... అమృత భారత్ స్టేషన్ పథకం కింద తమిళనాడులో 77 స్టేషన్లను సమగ్రంగా పునరుద్ధరిస్తున్నామని శ్రీ మోదీ తెలిపారు. ఆధునిక వందే భారత్ రైళ్లు నేడు తమిళనాడు ప్రజలకు సరికొత్త ప్రయాణ అనుభవాన్ని అందిస్తున్నాయి. దేశంలో తొలి వర్టికల్ లిఫ్ట్ రైలు వంతెన పంబన్ బ్రిడ్జిని కూడా తమిళనాడులో నిర్మించామని శ్రీ మోదీ చెప్పారు. ఈ ప్రాంతంలో వాణిజ్య సౌలభ్యాన్ని, ప్రయాణ సౌలభ్యాన్ని మెరుగుపరిచిన విశిష్టమైన ఇంజినీరింగ్ అద్భుతంగా దీన్ని వర్ణించారు.

"దేశవ్యాప్తంగా బృహత్తరమైన, ఆధునిక మౌలిక సదుపాయాల నిర్మాణం దిశగా ఓ విప్లవాత్మకమైన కార్యక్రమాన్ని భారత్ చేపడుతోంది" అని ప్రధానమంత్రి పేర్కొన్నారు. జమ్మూ కాశ్మీర్‌లో ఇటీవల ప్రారంభించిన చీనాబ్ వంతెనను ఓ ఇంజినీరింగ్ అద్భుతంగా ఆయన అభివర్ణించారు. ఇది మొదటిసారిగా జమ్మూ – శ్రీనగర్‌లను రైలు ద్వారా అనుసంధానించిందని తెలిపారు. దీనితోపాటు దేశంలో అతి పొడవైన సముద్ర వంతెన – అటల్ సేతు, అస్సాంలోని బోగిబీల్ వంతెన, ఆరు కిలోమీటర్లకు పైగా పొడవైన సోనామార్గ్ సొరంగం... ఇలా అనేక మైలురాయి వంటి పథకాలను భారత్ పూర్తి చేసిందని శ్రీ మోదీ వివరించారు. సమగ్రాభివృద్ధి దిశగా కేంద్ర ప్రభుత్వ అంకితభావాన్ని ఈ కార్యక్రమాలు ప్రతిబింబిస్తాయని, దేశవ్యాప్తంగా వేలాదిగా ఉద్యోగావకాశాలను అందించాయని ఆయన పేర్కొన్నారు.

తమిళనాడులో కొత్తగా ప్రారంభించిన రైల్వే ప్రాజెక్టులు రాష్ట్ర దక్షిణ ప్రాంతంలోని లక్షలాది ప్రజలకు ప్రయోజనం చేకూరుస్తాయని ప్రధానమంత్రి పేర్కొన్నారు. మధురై – బోడినాయకనూర్ రైల్వే లైన్ విద్యుదీకరణతో ఈ ప్రాంతంలో వందే భారత్ వంటి అధునాతన రైళ్లను నడపడానికి మార్గం సుగమమైందన్నారు. "ఈ రైల్వే కార్యక్రమాలతో తమిళనాడు పురోగతి వేగం పుంజుకుంటుంది, రాష్ట్ర అభివృద్ధి పునరుత్తేజంతో విస్తరిస్తుంది" అని శ్రీ మోదీ చెప్పారు.

తమిళనాడులోని 2,000 మెగావాట్ల కూడంకుళం అణు విద్యుత్ ప్రాజెక్టుకు అనుసంధానంగా కీలకమైన ట్రాన్స్మిషన్ ప్రాజెక్టుకు కూడా ప్రధానమంత్రి శంకుస్థాపన చేశారు. రూ. 550 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించిన ఈ వ్యవస్థ మున్ముందు సుస్థిర పద్ధతుల్లో విద్యుత్ సరఫరాలో కీలక పాత్ర పోషిస్తుందని భావిస్తున్నారు. ఇది భారత అంతర్జాతీయ ఇంధన లక్ష్యాలు, పర్యావరణ నిబద్ధతలకు అర్థవంతంగా దోహదపడుతుందని శ్రీ మోదీ పేర్కొన్నారు. విద్యుదుత్పత్తి పెరిగి.. దానితో తమిళనాడులోని పారిశ్రామిక రంగాలు, గృహ వినియోగదారులు విశేష ప్రయోజనాలను పొందే అవకాశముంది.

తమిళనాడులో ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన వేగంగా పురోగమించడంపై శ్రీ మోదీ సంతృప్తి వ్యక్తంచేశారు. ఈ పథకం కింద ప్రభుత్వానికి ఇప్పటికే దాదాపు లక్ష దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఇప్పటివరకు నలభై వేలకు పైగా గృహాల్లో సోలార్ రూఫ్ టాప్‌లను నెలకొల్పామని వెల్లడించారు. ఈ పథకం ఉచిత, పర్యావరణ హిత విద్యుత్తును అందించడమే కాకుండా, ఆ పద్ధతిలో వేలాదిగా ఉద్యోగాలను కూడా కల్పిస్తోందని ప్రధానమంత్రి వ్యాఖ్యానిం చారు.

తమిళనాడు అభివృద్ధి, అభివృద్ధి చెందిన తమిళనాడు అన్నవి కేంద్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యాలుగా ఉన్నాయని పునరుద్ఘాటించిన ప్రధానమంత్రి.. తమిళనాడు పురోగతికి సంబంధించిన విధానాలకు ఎప్పుడూ అగ్ర ప్రాధాన్యమిస్తున్నామని స్పష్టం చేశారు. గత దశాబ్ద కాలంలో కేంద్ర ప్రభుత్వం వికేంద్రీకరణ ద్వారా తమిళనాడుకు రూ. 3 లక్షల కోట్లు బదిలీ చేసిందని ఆయన ప్రముఖంగా పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో విడుదలైన మొత్తంతో పోలిస్తే ఇది మూడింతల కన్నా ఎక్కువ. ఈ పదకొండు సంవత్సరాల్లో తమిళనాడుకు పదకొండు కొత్త వైద్య కళాశాలలు మంజూరయ్యాయని శ్రీ మోదీ తెలిపారు. తీరప్రాంతాల్లోని మత్స్యకార వర్గాలపట్ల ప్రభుత్వం ఇంత అంకితభావంతో వ్యవహరించడం ఇదే తొలిసారి అని ఆయన వ్యాఖ్యానించారు. నీలి విప్లవంతో తీరప్రాంత ఆర్థిక వ్యవస్థను ప్రభుత్వం విస్తరిస్తోందని, ఇది సమ్మిళిత అభివృద్ధిని సాకారం చేస్తోందని ఆయన వ్యాఖ్యానించారు.

"తూత్తుకుడి అభివృద్ధిలో ఇది ఓ కొత్త పొద్దుపొడుపు" అని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు. అనుసంధానం, విద్యుత్ ప్రసారం, మౌలిక సదుపాయాల్లో చేపట్టిన కార్యక్రమాలు అభివృద్ధి చెందిన తమిళనాడు, అభివృద్ధి చెందిన భారత్‌కు బలమైన పునాదులు వేస్తున్నాయన్నారు. ఈ విప్లవాత్మక ప్రాజెక్టుల పట్ల తమిళనాడు ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆయన తన ప్రసంగాన్ని ముగించారు.

ఈ కార్యక్రమంలో తమిళనాడు గవర్నర్ శ్రీ ఆర్. ఎన్. రవి, కేంద్ర మంత్రులు శ్రీ రామ్మోహన్ నాయుడు కింజారపు, డాక్టర్ ఎల్. మురుగన్, ఇతర ముఖ్య అతిథులు పాల్గొన్నారు.

తూత్తుకుడి విమానాశ్రయంలో దాదాపు రూ. 450 కోట్ల వ్యయంతో నిర్మించిన కొత్త టెర్మినల్ భవనాన్ని ప్రధానమంత్రి ప్రారంభించారు. ప్రపంచస్థాయి వైమానిక మౌలిక సదుపాయాల అభివృద్ధి, మెరుగైన అనుసంధానం లక్ష్యాలకు అనుగుణంగా.. దక్షిణ ప్రాంతంలో పెరుగుతున్న విమానయాన డిమాండ్ దృష్ట్యా దీనిని నిర్మించారు. ఈ కొత్త నిర్మాణాన్ని ప్రధానమంత్రి పరిశీలించారు.

17,340 చదరపు మీటర్ల విస్తీర్ణంలో నిర్మించిన ఈ టెర్మినల్‌లో రద్దీ సమయాల్లో 1,350, ఏటా 20 లక్షల ప్రయాణికులకు అనువుగా ఉంటుంది. భవిష్యత్తులో రద్దీ సమయాల్లో 1,800, ఏటా 25 లక్షల ప్రయాణికులకు దీని సామర్థ్యాన్ని విస్తరించవచ్చు. 100 శాతం ఎల్ఈడీ లైటింగ్, తక్కువ ఇంధనంతో నడిచే విద్యుత్, యాంత్రిక వ్యవస్థలు, అందులోనే ఉన్న మురుగునీటి శుద్ధి కర్మాగారం ద్వారా శుద్ధి చేసిన నీటి పునర్వినియోగం... ఇలాంటి సదుపాయాలతో గృహ-4 సుస్థిరతా రేటింగ్ సాధించేలా ఈ టెర్మినల్‌ను నిర్మించారు. ఈ ఆధునిక మౌలిక సదుపాయాలు దక్షిణ తమిళనాడులో ప్రాంతీయ వైమానిక అనుసంధానాన్ని విశేషంగా పెంచడంతోపాటు పర్యాటకం, వాణిజ్యం, పెట్టుబడులను ప్రోత్సహిస్తాయని భావిస్తున్నారు.

రోడ్డు మౌలిక సదుపాయాల రంగంలో.. రెండు వ్యూహాత్మకంగా ముఖ్యమైన హైవే ప్రాజెక్టులను ప్రధానమంత్రి జాతికి అంకితం చేశారు. మొదటిది జాతీయ రహదారి- 36లో ఉన్న 50 కి.మీ సేథియాతోప్- చోళపురం మార్గాన్ని నాలుగు వరుసల రహదారిగా విస్తరించడం. విక్రవాండి-తంజావూర్ కారిడార్ కింద రూ. 2,350 కోట్లకు పైగా వ్యయంతో దీన్ని అభివృద్ధి చేస్తున్నారు. ఇందులో మూడు బైపాస్‌లు, కొల్లిడమ్ నదిపై 1 కి.మీ నాలుగు వరుసల వంతెన, నాలుగు ప్రధాన వంతెనలు, ఏడు ఫ్లైఓవర్లు, అనేక అండర్‌పాస్‌లు ఉన్నాయి. దీంతో సేథియాతోప్-చోళపురం మధ్య ప్రయాణ సమయం 45 నిమిషాలు తగ్గుతుంది. డెల్టా ప్రాంతంలోని సాంస్కృతిక, వ్యవసాయ కేంద్రాలతో అనుసంధానాన్ని పెంచుతుంది. రెండోది జాతీయ రహదారి-138లో ఉన్న 5.16 కి.మీ తూత్తుకుడి పోర్ట్ రోడ్డును 6 వరుసల రహదారిగా విస్తరించడం. దాదాపు రూ. 200 కోట్లతో దీనిని నిర్మిస్తున్నారు. అండర్‌పాస్‌లు, వంతెనలు ఉన్న ఈ ప్రాజెక్టుతో వస్తు సరఫరా సులభతరమవుతుంది, రవాణా ఖర్చులు తగ్గుతాయి. అంతేకాకుండా వి.ఒ. చిదంబరనార్ ఓడరేవు చుట్టుపక్కల ఓడరేవు ఆధారిత పరిశ్రమల అభివృద్ధికి ఇది తోడ్పడుతుంది.

ఓడరేవు మౌలిక సదుపాయాలను, పర్యావరణ హిత ఇంధన కార్యక్రమాలకు ఊతమిచ్చేలా.. నార్త్ కార్గో బెర్త్?ఎఎని ప్రధానమంత్రి ప్రారంభించారు. వి.ఒ. చిదంబరనార్ ఓడరేవులో దాదాపు రూ. 285 కోట్లు విలువైన 6.96 మిలియన్ మెట్రిక్ టన్నుల వార్షిక కార్గో నిర్వహణ సామర్థ్యంతో దీన్ని నిర్మించారు. ఆ ప్రాంతంలో భారీగ పెరుగుతున్న కార్గో అవసరాలను నెరవేర్చడంలో ఇది ఎంతగానో దోహదపడుతుంది. దీంతో మొత్తంగా పోర్టు సామర్థ్యం పెరగడంతోపాటు కార్గో నిర్వహణ రవాణా సానుకూలమవుతుంది.

దక్షిణ తమిళనాడులో సుస్థిరమైన, సమర్థమైన అనుసంధానాన్ని పెంచేలా మూడు కీలక రైల్వే మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను ప్రధానమంత్రి జాతికి అంకితం చేశారు. 90 కి.మీ మధురై-బోడినాయకనూర్ లైన్ విద్యుదీకరణ పర్యావరణ హిత రవాణాను ప్రోత్సహించడంతోపాటు మధురై, తేనిలలో పర్యాటకానికీ రాకపోకలకూ ఉపయోగపడుతుంది. తిరువనంతపురం – కన్యాకుమారి ప్రాజెక్టులో భాగమైన 21 కి.మీ నాగర్‌కోయిల్ టౌన్ ? కన్యాకుమారి సెక్షన్‌ను రూ. 650 కోట్లతో రెట్టింపు చేయడం వల్ల తమిళనాడు, కేరళ మధ్య సంబంధాలు బలోపేతమవుతాయి. దానితోపాటు అరల్వాయ్‌మొళి – నాగర్‌కోయిల్ జంక్షన్ (12.87 కి.మీ), తిరునెల్వేలి – మేలప్పలయం (3.6 కి.మీ) సెక్షన్లను డబుల్ ట్రాక్‌గా విస్తరించడం వల్ల చెన్నై-కన్యాకుమారి వంటి ప్రధాన దక్షిణ మార్గాల్లో ప్రయాణ సమయం తగ్గుతుంది. అలాగే ప్రయాణికులు, సరుకు రవాణా సామర్థ్యాన్ని పెంచి ఆ ప్రాంతంలో ఆర్థిక సమగ్రతను పెంపొందిస్తుంది.

రాష్ట్రంలో విద్యుత్ మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేసేలా.. ఓ ప్రధాన విద్యుత్ ప్రసార ప్రాజెక్టుకు ప్రధానమంత్రి శంకుస్థాపన చేశారు. కూడంకుళం అణు విద్యుత్ ప్లాంటు 3, 4 యూనిట్ల (2ఓ1000 మెగావాట్లు) నుంచి విద్యుత్తును తరలించే అంతర్రాష్ట్ర ప్రసార వ్యవస్థ (ఐఎస్‌టీఎస్) ఇది. దాదాపు రూ. 550 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఈ ప్రాజెక్టులో కుడంకుళం నుంచి తూత్తుకుడి-ఎఎ జీఐఎస్ ఉపకేంద్రం వరకు 400 కిలోవాట్ల (క్వాడ్) డబుల్ సర్క్యూట్ ప్రసార లైన్లు, అనుబంధ టెర్మినల్ పరికరాలు ఉంటాయి. జాతీయ గ్రిడ్‌ను బలోపేతం చేయడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుంది. సుస్థిరంగా విద్యుత్ పంపిణీతోపాటు తమిళనాడులో, లబ్ధిదారులుగా ఉన్న ఇతర రాష్ట్రాల్లో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్లను తీరుస్తుంది.

# ఘనంగా నల్ల పోచమ్మ ప్రతిష్ఠోత్సవాలు



మెదక్, జులై 28: రాయపోల్ మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో రెడ్డి సంఘం ఆధ్వర్యంలో నల్ల పోచమ్మ విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి.

ఉత్సవాల్లో భాగంగా ఆదివారం నల్ల పోచమ్మ విగ్రహ ప్రతిష్టను వేద బ్రాహ్మణ పండితుల మంత్రోచ్చరణల మధ్య ప్రతిష్టించారు.

రెడ్డి సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టగా.. రెడ్డి జాగృతి రాష్ట్ర వ్యవస్థాపకుడు బుట్టెంగారి మాధవరెడ్డి హాజరై మొక్కులు చెల్లించుకున్నారు.

సోమవారం మధ్యాహ్నం అమ్మవారికి ఇంటింటి నుంచి బోనాల ఊరేగింపు నిర్వహించారు. ఊరేగింపు నిర్వహించిన అనంతరం నల్ల పోచమ్మ అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ రెడ్డి సంఘం సభ్యులు. తదితరులు పాల్గొన్నారు.

# బీసీల ఓట్ల కోసమే బీజేపీ, కాంగ్రెస్ డ్రామా : శ్రీనివాస్ గౌడ్




హైదరాబాద్, జులై 28: బీసీల ఓట్ల కోసమే కాంగ్రెస్, బీజేపీలు డ్రామా ఆడుతున్నాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత శ్రీనివాస్ గౌడ్ ధ్వజమెత్తారు. తెలంగాణ భవన్‌లో శ్రీనివాస్ గౌడ్ ఇవాళ మీడియాతో మాట్లాడారు.

దేశం మొత్తం ఓబీసీ వర్గాల వెనకబాటు తనంపై చర్చ జరుగుతోంది. కేంద్ర ప్రభుత్వం కూడా కులగణనకు ఒప్పుకుంది. చట్ట సభల్లో కూడా బీసీలకు రిజర్వేషన్లు వస్తాయనే వాతావరణం ఏర్పడింది. చట్టసభల్లో రిజర్వేషన్లు దేవుడెరుగు ఇపుడు రాష్ట్రంలో స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు రావడం గగనమవుతోంది. గవర్నర్ దగ్గర ఆర్డినెన్స్‌కు మోక్షం లభించలేదు. ఢిల్లీలో రాష్ట్రపతి దగ్గర బుక్ బిల్లులు ఏమయ్యాయో తెలియదు అని శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు.

ఈ రోజు కేబినెట్ సమావేశం ఉంది ఏం తెలుస్తారు? బీసీల పట్ల కాంగ్రెస్, బీజేపీలది వగల ప్రేమే అని తెలిపోయింది. బీసీ ఓట్ల కోసమే ఆ రెండు పార్టీలు డ్రామా ఆడుతున్నాయి. తొమ్మిదో షెడ్యూల్లో పెడితే తప్ప బీసీలకు రిజర్వేషన్లు పెరుగవు. బీజేపీ ముస్లిం రిజర్వేషన్లను సాకుగా చూపి బీసీ రిజర్వేషన్ల పెంపును అడ్డుకుంటోంది. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ముస్లింలకు రిజర్వేషన్లు ఇవ్వడం లేదా ? ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లలో ముస్లింలు లేరా ? రిజర్వేషన్లు రాష్ట్రం పరిధిలో లేని అంశమనీ.. ఎవరైనా ఇక్కడ పెంచితే జైలుకు వెళ్లడం ఖాయమని రేవంత్ రెడ్డి ప్రతిపక్షంలో ఉండగా చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని అంశం కాదని తెలిసి రేవంత్ రెడ్డి రిజర్వేషన్ల పెంపు ఆర్డినెన్స్‌ను గవర్నర్ దగ్గరకు ఎందుకు పంపారు? బీసీ బిల్లుల ఆమోదానికి కేంద్రం దగ్గర రేవంత్ రెడ్డి ఎలాంటి ప్రయత్నాలు చేయడం లేదు. బీసీల మీద సీఎంది కపట ప్రేమ అని శ్రీనివాస్ గౌడ్ మండిపడ్డారు.

కాంగ్రెస్ బీసీ నాయకులు 42 శాతం రిజర్వేషన్ల పెంపు కోసం గట్టిగా కృషి చేయాలి. బీసీలకు ఏదీ చేయాలన్నా బీఆర్ఎస్‌తోనే సాధ్యమవుతుందన్నారు. సీఎం, మంత్రులు బీసీ బిల్లులు ఆమోదించుకోవడానికి ఢిల్లీ వెళ్లి పాస్ అయ్యాకే హైదరాబాద్ తిరిగి రావాలి. కాంగ్రెస్, బీజేపీల చేతిలో మరోసారి మోసపోవడానికి బీసీలు సిద్ధంగా లేర. ఆర్డినెన్స్ గవర్నర్ దగ్గరకు పంపగానే కాంగ్రెస్ నేతలు సంబరాలు చేసుకున్నారు .ఇపుడు ఏం సమాధానం చెబుతారు. బీసీలకు విద్యా ఉద్యోగాల్లో రిజర్వేషన్ల పెంపు కోసం ఎందుకు ఆర్డినెన్స్ తేలేదు..? ఢిల్లీకి అఖిలపక్షం తీసుకెళితే మేము వస్తాం. ఆ పని చేయడం లేదు అని శ్రీనివాస్ గౌడ్ దుయ్యబట్టారు.

# హమాలీ కార్మికులకు పీఎఫ్ ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలి : టీయూసీఐ నాయకులు



ఖమ్మం, జులై 28:హమాలీ కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, పని గంటలు పెంచే 282 జీఓను ప్రభుత్వం రద్దు చేయాలని టీయూసీఐ నాయకులు అన్నారు. ఈ నెల 31వ తేదీన కలెక్టర్ కార్యాలయం ముందు నిర్వహించే ధర్నాలో హమాలీలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ మేరకు ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయూసీఐ) రాష్ట్ర మహాసభ పిలుపులో భాగంగా సోమవారం ఇల్లెందు పట్టణం గిరిజన ప్రాథమిక సహకార సంఘం గోడౌన్‌లో పనిచేస్తున్న హమాలీల ఆధ్వర్యంలో గిరిజన కార్పొరేషన్ (జిసిసి)లో గోదాము ఇన్‌చార్జి వీరేశం కు వినతి పత్రం అందజేశారు. అనంతరం హమాలీ సెక్రటరీ బోల్ల సీతారాములు అధ్యక్షతన జరిగిన సభలో ఇల్లెందు ఏరియా అధ్యక్ష, కార్యదర్శులు పాయం వెంకన్న, మల్లెల వెంకటేశ్వర్లు పాల్గొని మాట్లాడారు.

హమాలీలకు ఉపాధి భద్రతతో కూడిన సమగ్రమైన చట్టం ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్రంలో 3 లక్షలకు పైగా హమాలీలు వివిధ రంగాల్లో పని చేస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు నుండి నేటి వరకు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి హమాలీ కార్మికుల సమస్యలపై అనేకసార్లు మంత్రులకు, ఎమ్మెల్యేలకు, అధికారులకు విన్నవించినా చర్యలు తీసుకోవడంలో చొరవ చూపడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం అసంఘటితరంగ కార్మికుల సమస్యల అధ్యయనం కోసం అమృతసేన్ కమిషన్‌ను నియమించింది. ఈ కమిషన్ రిపోర్టు ప్రకారం కేంద్ర ప్రభుత్వం 2008లోనే ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్ర కార్మికుల స్థితిగతులు పరిశీలించి రూల్స్ రూపొందించుకోవాలని సూచనలు చేసినా ఇప్పటికీ వీరిపై కన్నెత్తి చూడకపోవడం బాధాకరమన్నారు. పొద్దంతా మూటలు మోసి పనిచేసినా పూట గడవడం లేదన్నారు.

ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హమాలీ కార్మికుల పట్ల తమ చిత్తశుద్ధిని నిరూపించుకుని పీఎఫ్, ఈఎస్ఐతో పాటు ఉపాధి భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు.

ఈ నెల 31న తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లా కలెక్టర్ల కార్యాలయం ముందు ధర్నా నిర్వహించాలని హమాలీలకు పిలుపునిచ్చారని. ఈ కార్యక్రమంలో ఏరియా సహాయ కార్యదర్శి వేముల గురునాథం, హమాలీ దడ్వాయి బొల్లి రవి, మోటార్ సంపత్, శ్యామ్, భాజ్యా, శ్రీను, రాజశేఖర్, రామ చంద్రు, ఉపేందర్, సాయి పాల్గొన్నారు.

# పెహల్గామ్‌కు ఎలా పాక్ ఉగ్రవాదులు వచ్చారు?: ప్రశ్నించిన ఎంపీ గౌరవ్ గగోయ్

బఆపరేషన్ సింధూర్‌పై ఇవాళ లోక్‌సభలో చర్చ జరిగింది. ఆ సమయంలో కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గగోయ్ మాట్లాడారు. ఆపరేషన్ సింధూర్ గురించి రక్షణ మంత్రి రాజ్‌నాథ్ చాలా విషయాలు చెప్పారని, కానీ పెహల్గామ్‌కు ఎలా ఉగ్రవాదులు వచ్చారో చెప్పలేదన్నారు. బైసారన్ పచ్చికబయళ్లకు ఉగ్రవాదులు ఎలా వచ్చారో ప్రభుత్వం చెప్పలేదన్నారు. వేల మంది టూరిస్టులు ఉండే ప్రాంతానికి ఉగ్రవాదులు ఎలా వచ్చారని అడిగారు. పెహల్గామ్ ఘటనను ఇన్‌ఫర్మేషన్ వార్ అని పేర్కొన్నారు. మతం ఆధారంగా ప్రజల్ని టార్గెట్ చేయవద్దు అని గగోయ్ అన్నారు. ఎలా ఆ అయిదుగురు ఉగ్రవాదులు పాకిస్థాన్ నుంచి ఇండియాకు ఎంటర్ అయ్యారని, వాళ్ల ఉద్దేశం ఏంటని ఆయన అడిగారు.

పెహల్గామ్‌లో దాడికి పాల్పడిన అయిదుగురు ఉగ్రవాదులను ఎందుకు పట్టుకోలేదని ఆయన ప్రశ్నించారు. వంద రోజులు దాటినా వాళ్లను ఎందుకు బంధించలేదన్నారు. ప్రభుత్వం వద్ద దానిపై సమాధానం లేదన్నారు. మీవద్ద డ్రోన్లు, పెగాసస్, శాటిలైట్లు ఉన్నాయని, కానీ ఆ ఉగ్రవాదులను మీరు పట్టుకోలేక పోయారని కాంగ్రెస్ నేత అన్నారు. ఆర్టికల్ 370ని రద్దు చేశారని, కశ్మీర్ లోయకు పర్యాటకులను ఆహ్వానించారు, కానీ పెహల్గామ్



అటాక్ సమయంలో వాళ్లు నిస్సహాయులుగా ఉండిపోయినట్లు ఆయన ఆరోపించారు. పెహల్గామ్ ఉగ్రదాడికి కేంద్ర మంత్రి అమిత్ షా బాధ్యత వహించాలన్నారు. దీనికి లెఫ్టినెంట్ గవర్నర్‌ను బలి చేయరాదు అని అన్నారు.


ప్రస్తుత ప్రభుత్వ హయాంలో అత్యంత భయంకరమైన దాడి జరిగిందని గగోయ్ ఆరోపించారు. రఫేల్ యుద్ధ విమానాల కోల్పోయిన అంశంపై త్రివిధ దళాధిపతి అనిల్ చౌహాన్ ఓ టీవీకి ఇచ్చిన ఇంటర్వ్యూ అంశాన్ని ఆయన గుర్తు చేశారు. పాకిస్థాన్, భారత్ మధ్య కాల్పుల విరమణ తన వల్లే జరిగిందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇప్పటి వరకు 26 సార్లు వెల్లడించారని, దీనిపై నిజం ఏంటో చెప్పాలని ఆయన ప్రశ్నించారు. పెహల్గామ్ ఉగ్రదాడి, సిందూర్ ఆపరేషన్ తర్వాత జరిగిన అంతర్జాతీయ దౌత్యం గురించి వెల్లడించాలని గగోయ్ అడిగారు. పాకిస్థాన్‌కు ఐఎంఎఫ్ రుణం అందకుండా ఇండియా ఎందుకు అడ్డుకోలేదన్నారు. పాకిస్థాన్‌తో ఎందుకు కాల్పుల విరమణకు అంగీకరించారో ప్రధాని మోదీ చెప్పాలని గగోయ్ డిమాండ్ చేశారు.

# జ్ఞానాన్ని, యుక్తిని మేళవించి రచించిన బాలసాహిత్యకర్త ఆర్.సి.కృష్ణస్వామి రాజు

-డా॥ నెమిలేటి కిట్టన్న

హైదరాబాద్, జులై 28: విజ్ఞానాన్ని, యుక్తిని మేళవించి బాలసాహిత్యాన్ని సృష్టించిన మేటి రచయిత ఆర్.సి.కృష్ణస్వామి రాజు అని విశ్రాంత తెలుగు పండితులు డా॥ నెమిలేటి కిట్టన్న (తిరుపతి) అన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం నిర్వహిస్తున్న 'నెలనెలా సీమ సాహిత్యం' కార్యక్రమంలో భాగంగా ఆదివారం (27/7/2025) బ్రౌన్‌శాస్త్రి సమావేశ మందిరంలో 145వ సదస్సు నిర్వహింపబడిరది.

ఈ కార్యక్రమంలో సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి మాట్లాడుతూ ఆర్.సి.కృష్ణస్వామి రాజు రచనలు చిత్తూరు జిల్లా మాండలికంలో, జనం మాట్లాడుకొనే భాషలో ఉంటాయని, అదేవిధంగా అక్కడి ప్రాంతాలే ఆయన కథాకేంద్రాలుగాఉంటాయన్నారు. ఆ తర్వాత 'ఆర్.సి.కృష్ణస్వామి రాజు బాల సాహిత్యం' అనే అంశంపై విశ్రాంత తెలుగు పండితులు డా॥ నెమిలేటి కిట్టన్న ప్రసంగించారు. ఆయన తన ప్రసంగంలో రాయలసీమ కథాసాహిత్యానికి వన్నె తెచ్చిన కథకుల్లో ఆర్.సి. కృష్ణస్వామి రాజు ఒకరని, బాల సాహిత్యకర్తగా కూడా ఆయన గురుతరమైన బాధ్యతను నిర్వర్తిస్తున్నారన్నారు. ఇప్పటివరకు ఆయనవి చిన్నాపెద్దా కథలు 650 దాకా వివిధ పత్రికల్లో ప్రచురింపబడ్డాయని, వీటిలో 150 పిల్లల కథలు ఉండడం విశేషమన్నారు. ఆర్.సి. కృష్ణస్వామి రాజు గారు తిరుపతి జిల్లా పుత్తూరు శల్య వైద్య కుటుంబానికి చెందినవారన్నారు. ఆయన మొదట కార్వేటి నగరం డైట్‌లో అధ్యాపక ట్రైనింగ్ పూర్తిచేశారని, ఆ తర్వాత తిరుపతి ఎల్.ఐ.సి కార్యాలయంలో 35 ఏళ్ళ పాటు డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా పనిచేసి పదవీ విరమణ చేశారన్నారు. ఆయన ఇప్పటి దాకా భిన్న వర్గాలకు చెందిన 18 కథా సంపుటాలను, 2 నవలలను వెలువరించారన్నారు. బాల సాహిత్య సృష్టిలో భాగంగా ఆయన' రాజు గారి కథలు, రాణి గారి కథలు, కార్వేటినగరం కథలు, నాన్నారం కథలు' అనే కథాసంపుటాలను, 'మేకల బండ, మునికిష్టడి మాణిక్యం' అనే నవలలను రాశారన్నారు. ఈ రచనల్లో ఆయన వాడిన తెలుగు జాతీయాలను, సామెతలను, నుడికారాలను ఉదాహరణలతో వివరించారు. మానవీయ సంబంధా




లు, విలువలు కృష్ణస్వామి రాజు బాలసాహిత్యంలో ఎలా చిత్రింపబడిరది విశ్లేషణాత్మకంగా తెలియజేశారు. కార్యక్రమాన్ని డా॥ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి, డా॥ చింతకుంట శివారెడ్డి సమన్వయం చేశారు.

కార్యక్రమం అనంతరం వక్త డా॥ నెమిలేటి కిట్టన్నను సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి, యోగి వేమన విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి, పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డా॥ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి, డా॥ చింతకుంట శివారెడ్డి, గ్రంథాలయ సహాయకులు ఎన్.రమేశ్ రావు, జూనియర్ అసిస్టెం ట్లు ఆర్. వెంకటరమణ, ఎం.మౌనిక, సిబ్బంది, పాఠకులు కలసి శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో అహ్మద్ బాషా, పళ్ళె విజయ్, కుమార్, కొత్తపల్లె రామాంజనేయులు, శ్యామసుందర్ రెడ్డి, రమణమూర్తి, వెంకట రమణ, విజయ కుమార్, సుబ్బరాయుడు, బాలరాజేశ్వర రెడ్డి, నల్లపరెడ్డి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# సుప్రసిద్ధ భారతీయ చక్రవర్తులలో ఒకరైన ఒకటో రాజేంద్ర చోళుని గౌరవార్థం స్మారక నాణెం ఆవిష్కరించిన ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, జులై 28:తమిళనాడులోని గంగైకొండ చోళపురం ఆలయంలో ఈ రోజు ఆడి తిరువాతిరై వేడుక సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రసంగించారు. ముందుగా ఆదిదేవుడైన మహాశివునికి నీరాజనం అర్పిస్తూ- రాజరాజ చోళుడు రాజ్యమేలిన పవిత్ర భూమిలో పరమేశుని దివ్య దర్శనంతో తనలో ఆధ్యాత్మిక శక్తి పెల్లుబికిందని పేర్కొన్నారు. శ్రీ ఇళయరాజా స్వరాలు సమకూర్చిన భక్తి గీతాలాపనను అమితంగా ఆస్వాదించానని చెప్పారు. శైవారాధకులైన 'ఓతువర్ల' పవిత్ర మంత్రోచ్ఛారణ నడుమ సర్వశక్తిమంతుడైన శివుడికి నమస్కరిస్తూ- ఇక్కడి ఆధ్యాత్మిక వాతావరణంతో తాదాత్మ్యం చెందానని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు.

పవిత్ర శ్రావణమాస ప్రాధాన్యాన్ని, చారిత్రక బృహదీశ్వరాలయం నిర్మాణ సహస్రాబ్ది సందర్భాన్ని గుర్తుచేస్తూ- ఇలాంటి విశిష్ట సమయాన బృహదీశ్వరుని పాదార్చన తనకు దక్కిన అదృష్టమని ఆయన హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. భారత నిరంతర పురోగమనం, 140 కోట్ల మంది ప్రజల సంక్షేమం కోసం చరిత్రాత్మక బృహదీశ్వరాలయంలో ప్రార్థిస్తూ, ఆదిదేవుని ఆశీస్సులు అందరికీ అందాలని ఆకాంక్షించినట్లు తెలిపారు.

వెయ్యేళ్ల కిందటే మానవాళి సంక్షేమం-సౌభాగ్యం కోసం మన పూర్వీకులు రూపొందించిన చారిత్రక ప్రణాళికపై కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ నిర్వహిస్తున్న ప్రదర్శనను ప్రజలంతా చూడాలని శ్రీ మోదీ కోరారు. చిన్మయ మిషన్ రూపొందించిన తమిళ గీత గుచ్ఛం ఆవిష్కరణ కార్యక్రమానికి కూడా ఆయన హాజరయ్యారు. దేశ వారసత్వ పరిరక్షణ సంకల్పానికి ఇది సరికొత్త శక్తినిస్తుందని ఈ సందర్భంగా వ్యాఖ్యానిస్తూ, ఈ కృషిలో భాగస్వాములైన ప్రతి ఒక్కరినీ అభినందించారు.

శ్రీలంక, మాల్దీవ్స్ సహా ఆగ్నేయాసియా వరకూ చోళ రాజులు దౌత్య-వాణిజ్య సంబంధాలను విస్తరించారని ప్రధానమంత్రి ప్రముఖంగా ప్రస్తావించారు. మాల్దీవ్స్ నుంచి నిన్న తిరిగివచ్చిన తాను, ఇవాళ తమిళనాడులో యాదృచ్ఛికంగా ఈ కార్యక్రమానికి హాజరు కావడాన్ని ఆయన గుర్తుచేశారు.

శివధ్యాన నిమగ్నులైనవారు ఆదిదేవుని తరహాలో నిత్యమై నిలిచిపోతారని ఇతిహాసాలు పేర్కొనడాన్ని ప్రధానమంత్రి ఉటంకించారు. మహాదేవునిపై అచంచల భక్తిభావనలో భారతదేశ చోళ వారసత్వం అజరామరమైందని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు. "రాజరాజ చోళుడు, రాజేంద్ర చోళుని వారసత్వం భారతదేశ గౌరవ ప్రతిష్ఠలకు చిహ్నం" అని ఉద్ఘాటించారు. చోళ సామ్రాజ్య చరిత్ర- వారసత్వాలను భారత వాస్తవిక సామర్థ్యానికి ప్రతీకలుగా అభివర్ణించారు. వికసిత భారత్ సంకల్ప సాకారంపై జాతి ఆకాంక్షకు ఇవి స్ఫూర్తినిస్తాయన్నారు. రాజేంద్ర చోళుడికి దేశం నివాళి అర్పిస్తున్నదని, ఆయన నిత్యసజీవ వారసత్వానికి ఇది నిదర్శనమని ఆయన చెప్పారు. ఇటీవలి ఆడి తిరువాతిరై వేడుకను ప్రస్తావిస్తూ- నేటి ఈ విశిష్ట కార్యక్రమంతో అది సమాప్తం అవుతున్నదని గుర్తుచేస్తూ, దీనిలో పాలుపంచుకున్న అందరికీ శ్రీ మోదీ అభినందనలు తెలిపారు.

''చోళుల కాలాన్ని భారత స్వర్ణయుగాలలో ఒకటిగా చరిత్రకారులు పరిగణిస్తారు. ఇది సైనిక బలం వైశిష్ట్యాన్ని చాటిచెప్పిన విభిన్న శకం" అని ప్రధానమంత్రి పేర్కొన్నారు. భారత ప్రజాస్వామ్య సంప్రదాయాలను చోళ సామ్రాజ్యం మరింత వర్ధిల్లేలా చేసినా, ప్రపంచ చరిత్రలో ఇది విస్మరణకు గురైందని ఆయన స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంపై చర్చలో బ్రిటన్ 'మాగ్నా కార్టా' గురించి చరిత్రకారులు ప్రస్తావిస్తుంటారని, దీనికి శతాబ్దాల కిందటే "కుడవోలై అమైప్పు" వ్యవస్థ ద్వారా ప్రజాస్వామ్య ఎన్నికల విధానాలను చోళ సామ్రాజ్యం అమలు చేసిందని పేర్కొన్నారు. నేటి ప్రపంచంలో జల నిర్వహణ-పర్యావరణ పరిరక్షణ చుట్టూ చర్చలు కేంద్రీకృతం కావడాన్ని శ్రీ మోదీ ప్రస్తావించారు. అయితే, మన పూర్వీకులు ఈ సమస్యల పరిష్కార ప్రాముఖ్యాన్ని ఆనాడే అర్థం చేసుకున్నారని ఆయన గుర్తుచేశారు. అనేక విజయాలతో బంగారం, వెండి లేదా పశుసంపద పోగుచేసినవారుగా చాలామంది రాజులు గుర్తింపు పొందారని పేర్కొన్నారు. అయితే, పవిత్ర గంగాజలాన్ని దక్షిణాదికి తెచ్చిన భగీరథుడుగా రాజేంద్ర చోళుడు ప్రసిద్ధి చెందాడని ఆయన ఉటంకించారు. ఉత్తర భారతం నుంచి గంగను తెచ్చిన ఆ రాజు ఘనతను గుర్తుచేస్తూ- "గంగా జలమయం జయస్తంభం" అనే పదబంధాన్ని ప్రధానమంత్రి ప్రస్తావించారు. ఈ నీటిని చోళ గంగా సరస్సులోకి మళ్లించారని, దీన్ని నేడు 'పొన్నేరి సరస్సు'గా పిలుస్తున్నామని పేర్కొన్నారు.

రాజేంద్ర చోళుడు నిర్మించిన గంగైకొండ చోళపురం ఆలయ వైశిష్ట్యాన్ని ప్రముఖంగా ప్రస్తావిస్తూ, ఇదొక వాస్తుశిల్ప అద్భుతంగా నేటికీ ప్రపంచ ప్రశంసలు అందుకుంటోందని పేర్కొన్నారు. కావేరీ మాత ప్రవహించే నేలపై గంగామాతకు లభించిన గౌరవం కూడా చోళ సామ్రాజ్య వారసత్వమేనని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు. ఈ చారిత్రక ఘట్టాన్ని స్మరించుకుంటూ కాశీ నుంచి తమిళనాడుకు గంగాజలాన్ని మరోసారి తీసుకువచ్చారని పేర్కొన్నారు. దీనితో ఆలయ ప్రదేశంలో సంప్రదాయక కార్యక్రమం సమాప్తం కావడంపై హర్షం వెలిబుచ్చారు. కాశీ నుంచి ఎన్నికైన ప్రజా ప్రతినిధిగా గంగామాతతో తనది లోతైన భావోద్వేగ బంధమని ప్రధానమంత్రి చెప్పారు. చోళ రాజులతో ముడిపడిన కృషి, కార్యక్రమాలు పవిత్ర కార్యాలకు ప్రతీకలని, "ఒకే భారత్-శ్రేష్ఠ భారత్" సూత్రానికి చిహ్నమేగాక, దానికొక సరికొత్త, చిరస్మరణీయ ఉత్తేజమిచ్చాయని ఆయన వివరించారు.

"చోళ చక్రవర్తులు ఈ దేశాన్ని సాంస్కృతిక ఐక్యత సూత్రంతో పెనవేశారు. నాటి చోళ దృక్పథాన్ని మా ప్రభుత్వం నేడు కొనసాగిస్తోంది" అని ప్రధానమంత్రి అన్నారు. కాశీ-తమిళ సంగమం, సౌరాష్ట్ర-తమిళ సంగమం వంటి కార్యక్రమాలు శతాబ్దాల నాటి ఈ ఐక్యత బంధాన్ని మరింత బలోపేతం చేస్తున్నాయని చెప్పారు. తమిళనాడులోని గంగైకొండ చోళపురం వంటి ప్రాచీన ఆలయాలను భారత పురావస్తు అధ్యయన సంస్థ (ఏఎస్ఐ) ద్వారా ప్రభుత్వం సంరక్షిస్తున్నదని శ్రీ మోదీ తెలిపారు. కొత్త పార్లమెంట్ భవన ప్రారంభం సందర్భంగా శైవాధీన మఠం సాధువులు ఆధ్యాత్మికంగా వేడుకను నడిపించి, తమిళ సంస్కృతి లో అంతర్భాగమైన పవిత్ర సెంగోల్‌ను ఆ సౌధంలో సగౌరవంగా ప్రతిష్ఠించారని గుర్తుచేశారు. ఆ ఘట్టం స్మరణకు వచ్చినపుడల్లా అనుక్షణం తానెంతో గర్విస్తానని ప్రధానమంత్రి పేర్కొన్నారు. చిదంబరం నటరాజ ఆలయ దీక్షితులను కలుసుకోవడాన్ని ప్రస్తావిస్తూ- శివుడు నటరాజుగా పూజలందుకునే దివ్యాలయ పవిత్ర నైవేద్యాన్ని తనకు అందజేశారని శ్రీ మోదీ భక్తిపురస్సరంగా ప్రకటించారు. భారత తత్త్వశాస్త్ర, విజ్ఞాన పునాదులకు ఈ నటరాజ రూపం ప్రతీక అని ఆయన వ్యాఖ్యానించారు. ఆ నటరాజు ఆనంద తాండవ విగ్రహం రెండేళ్ల (2023) కిందటి జి-20 శిఖరాగ్ర సదస్సులో ప్రపంచ నాయకులు సమావేశమైన ఢిల్లీలోని భారత్ మంటపానికి వినూత్న శోభనిచ్చిందని ప్రధానమంత్రి గుర్తుచేశారు.

"భారత సాంస్కృతిక ప్రతిష్ఠకు రూపమివ్వడంలో శైవ సంప్రదాయం కీలకపాత్ర పోషించింది. ఆ వారసత్వాన్ని సమున్నత స్థాయికి చేర్చింది చోళ చక్రవర్తులే. ఈ సజీవ సంప్రదాయం నేటికీ వర్ధిల్లే ప్రధాన కేంద్రాల్లో తమిళనాడు ఒకటి" అని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. పూజ్యనీయ నయనార్ సాధువుల వారసత్వం, భక్తి సాహిత్యం, తమిళ సాహితీ రచనలు, అధీనాల ఆధ్యాత్మిక ప్రభావాన్ని ప్రముఖంగా ప్రస్తావిస్తూ- సామాజిక-ఆధ్యాత్మిక రంగాల్లో నవశకానికి ఇవన్నీ ఉత్ప్రేరకాలుగా నిలిచాయని ఆయన పేర్కొన్నారు.

ప్రపంచం నేడు అస్థిరత, హింస, పర్యావరణ సంక్షోభం వంటి అనేక సమస్యలను ఎదుర్కొంటున్నదని శ్రీ మోదీ గుర్తుచేశారు. ఇలాంటి సవాళ్లకు శైవ తర్కం అర్థవంతమైన పరిష్కారాలను సూచించగలదని స్పష్టం చేశారు. 'అన్బే శివం' (ప్రేమే దైవం) పేరిట ప్రసిద్ధ తమిళ సాహితీవేత్త తిరుమూలర్ ప్రబోధించిన ప్రేమతత్త్వాన్ని ఈ సందర్భంగా ఆయన ఉదాహరించారు. ప్రపంచం ఈ ధోరణిని అనుసరిస్తే, అనేక సంక్షోభాలు వాటికవే సమసిపోగలవని చెప్పారు. "ఒకే ప్రపంచం-ఒకే కుటుంబం-ఒకే భవిష్యత్తు' నినాదంతో ఈ తత్త్వాన్ని భారత్ విస్తరింపజేస్తున్నదని ప్రధానమంత్రి తెలిపారు.

"ఇటు వికాసం-అటు వారసత్వం' అన్నది మన దేశం అనుసరిస్తున్న తారకమంత్రం. తదనుగుణంగా తన చరిత్రపై నేటి నవ భారత్ గర్విస్తోంది" అని శ్రీ మోదీ అన్నారు. ఈ సాంస్కృతిక వారసత్వ పరిరక్షణ దిశగా గడచిన దశాబ్దం నుంచీ దేశం ఉద్యమ స్ఫూర్తితో ముందడుగు వేస్తున్నదని వ్యాఖ్యానించారు. అపహరణకు గురైన, విదేశాల్లో విక్రయించబడిన ప్రాచీన విగ్రహాలు, కళాఖండాలను తిరిగి తేవడాన్ని ఆయన ప్రస్తావించారు. ఇందులో భాగంగా 2014 నుంచి వివిధ దేశాల్లోగల 600కుపైగా పురాతన కళాఖండాలను స్వదేశానికి చేర్చామని గుర్తుచేశారు. వీటిలో 36 ప్రత్యేకించి తమిళనాడుకు చెందినవేనని ప్రధానమంత్రి ప్రముఖంగా ప్రస్తావించారు. "నటరాజ, లింగోద్భవ, దక్షిణామూర్తి, అర్ధనారీశ్వర, నందికేశ్వర, ఉమా పరమేశ్వరి, పార్వతి, శైవ తత్త్వవేత్త సంబందర్" సహా అమూల్య వారసత్వ సంపద తమిళ నేలను ప్రకాశింపజేసిందని ఆయన వివరించారు.

భారతీయ వారసత్వం, శైవతత్త్వ ప్రభావం ఇకపై భౌగోళిక సరిహద్దులకే పరిమితం కాబోవని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. ఈ మేరకు చంద్రుని దక్షిణ ధ్రువంపై పాదం మోపిన తొలి దేశంగా భారత్ అవతరించినపుడు వ్యోమనౌక దిగిన "శివశక్తి"గా నామకరణం చేయడాన్ని ఆయన గుర్తుచేశారు. ఈ ఘట్టం యావత్ ప్రపంచం దృష్టిని ఆకర్షించిందని శ్రీ మోదీ పేర్కొన్నారు.

"చోళుల కాలంలో అత్యున్నత శిఖరాలను అందుకున్న భారత ఆర్థిక-సైనిక శక్తి నేటికీ మనకు స్ఫూర్తిదాయకం. రాజరాజ చోళుడు శక్తిమంతమైన నావికాదళాన్ని రూపొందించగా రాజేంద్ర చోళుడు దాన్ని మరింత బలోపేతం చేశాడు" అని ప్రధానమంత్రి జ్ఞప్తికి తెచ్చారు. చోళుల కాలంలో స్థానిక పాలన వ్యవస్థల సాధికారత, శక్తిమంతమైన ఆదాయార్జన విధానం వంటి కీలక పరిపాలన సంస్కరణలను ఆయన ప్రస్తావించారు. వాణిజ్య ప్రగతి, సముద్ర మార్గాల వినియోగం, కళాసంస్కృతులకు ప్రోత్సాహం తదితరాల ద్వారా భారత్ నలుదిశలా వేగంగా పురోగమించిందని తెలిపారు. నవ భారతాన్ని తీర్చిదిద్దడంలో నాటి ఘనతర చోళ సామ్రాజ్య విధానం మనకు ప్రాచీన ప్రణాళికగా ఉపకరిస్తుందని చెప్పారు. అభివృద్ధి చెందిన దేశంగా రూపొందాలంటే ఐక్యతకు భారత్ ప్రాధాన్యమివ్వాలి. నావికాదళం సహా రక్షణ బలగాలను మరింత బలోపేతం చేయాలి. కొత్త అవకాశాలను అన్వేషించడంతోపాటు తనదైన మూల విలువలను పరిరక్షించుకోవాలని శ్రీ మోదీ అన్నారు. ఈ దృక్కోణంతోనే దేశం నేడు ముందడుగు వేస్తున్నదని ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు.

అంతర్గత భద్రతే నేటి భారత్ అగ్ర ప్రాథమ్యమని వివరిస్తూ- 'ఆపరేషన్ సిందూర్'ను ప్రధానమంత్రి ఉటంకించారు.

ఈ మేరకు దేశ సార్వభౌమత్వాన్ని సవాలు చేసే ఏ ముప్పునైనా భారత్ దృఢంగా, నిర్ణయాత్మకంగా తిప్పికొట్టగలదనే వాస్తవం నేడు ప్రపంచం కళ్లకు కట్టిందని పేర్కొన్నారు. ఉగ్రవాదులకు, దేశ శత్రువులకు ఈ నేల సురక్షిత ప్రదేశం కాబోదని ఈ ఆపరేషన్ విస్పష్ట హెచ్చరిక పంపిందని చెప్పారు. అంతేకాకుండా దేశ ప్రజలలో సరికొత్త విశ్వాసం నింపిందని, దీనికి యావత్ ప్రపంచం సాక్షిగా నిలిచిందన్నారు. గంగైకొండ చోళపురం ఆలయ నిర్మాణాన్ని ప్రముఖంగా ప్రస్తావిస్తూ- రాజేంద్ర చోళుడి వారసత్వాన్ని ప్రస్ఫుటం చేసే ఆలోచనాత్మక దృష్టాంతాన్ని ఉదాహరించారు. ఈ మేరకు తంజావూరులో రాజరాజ చోళుడు నిర్మించిన బృహదీశ్వరాలయంతో పోలిస్తే ఈ ఆలయ గోపురం ఎత్తును కాస్త తగ్గించి తన తండ్రిపై అత్యున్నత గౌరవాన్ని రాజేంద్ర చోళుడు చాటుకున్నాడని వివరించారు. తండ్రికి దీటుగా తానూ ఎన్నో విజయాలు సాధించినా, రాజేంద్ర చోళుడు వినయం ప్రదర్శించాడని గుర్తుచేశారు. "నేటి నవ భారత్ ఇదే స్ఫూర్తితో ఒకవైపు శక్తిమంతం అవుతూనే, మరోవైపు ప్రపంచ సంక్షేమం, ఐక్యత తదితర విలువలకు నిరంతర ప్రాధాన్యమిస్తోంది'' అని ప్రధానమంత్రి పేర్కొన్నారు.

భారత వారసత్వ ప్రతిష్ఠను ఇనుమడింపజేయడంపై ప్రధానమంత్రి దృఢ సంకల్పం ప్రకటించారు. ఇందులో భాగంగా తమిళనాడులో రాజరాజ చోళుడితోపాటు పాలన దక్షుడుగా పేరొందిన ఆయన కుమారుడు 'ఒకటో రాజేంద్ర చోళుడి' విగ్రహ ప్రతిష్ఠాపన చేస్తామని శ్రీ మోదీ వెల్లడించారు. ఈ విగ్రహాలు భారత చారిత్రక చైతన్యానికి ఆధునిక మూలధారాలు కాగలవని ఆయన పేర్కొన్నారు. ఈ రోజు పూర్వ రాష్ట్రపతి డాక్టర్ ఎ.పి.జె.అబ్దుల్ కలాం వర్ధంతి అని ప్రధానమంత్రి గుర్తుచేశారు. వికసిత భారత్ దిశగా దేశాన్ని నడిపించడానికి చోళరాజులు, డాక్టర్ కలాం తరహా యువత లక్షలాదిగా ముందుకు రావడం అవశ్యమని వ్యాఖ్యానించారు. అటువంటి అంకితభావం, శక్తిమంతమైన యువత 140 కోట్ల మంది భారతీయుల కలలను నెరవేర్చగలరని స్పష్టం చేశారు. మనమంతా భుజం కలిపి, 'ఒకే భారత్-శ్రేష్ఠ భారత్' సంకల్ప సాకారానికి కృషి చేద్దామని పిలుపునిస్తూ- ఈ సందర్భంగా ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో వివిధ ప్రసిద్ధ మఠాల సాధువులు, తమిళనాడు గవర్నర్ శ్రీ ఎన్.రవి, కేంద్ర మంత్రి డాక్టర్ మురుగన్, ఇతర ప్రముఖులు పలువురు పాల్గొన్నారు.

గంగైకొండ చోళపురం ఆలయంలో ఆడి తిరువాతిరై వేడుకల సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో సుప్రసిద్ధ భారతీయ చక్రవర్తులలో ఒకరైన ఒకటో రాజేంద్ర చోళుని గౌరవార్థం స్మారక నాణాన్ని ప్రధానమంత్రి ఆవిష్కరించారు.

ఒకటో రాజేంద్ర చోళుని ఐతిహాసిక ఆగ్నేయాసియా సముద్ర యాత్ర సహస్రాబ్ది (వెయ్యేళ్లు) సహా వాస్తుశిల్ప అద్భుతానికి ప్రతీకగా ప్రపంచ ప్రశంసలు అందుకున్న గంగైకొండ చోళపురం ఆలయ శంకుస్థాపన ఘట్టాన్ని ఈ ప్రత్యేక వేడుకలు ప్రతిబింబించాయి.

భారత చరిత్రలో అత్యంత శక్తిమంతుడైన, దార్శనిక పాలకులలో ఒకటో రాజేంద్ర చోళుడు (1014-1044 సీఈ) ఒకరు. ఆ చక్రవర్తి నాయకత్వంలో దక్షిణ-ఆగ్నేయాసియా అంతటా చోళ సామ్రాజ్య ప్రభావం విస్తరించింది. తన విజయ యాత్రల తర్వాత గంగైకొండ చోళపురం రాజధానిగా తన సామ్రాజ్యాన్ని సుస్థిరం చేసుకున్నాడు. అక్కడ ఆయన నిర్మించిన ఆలయం 250 ఏళ్లకుపైగా కాలం నుంచి శైవభక్తి, అద్భుత వాస్తుశిల్పం, పాలనా నైపుణ్యానికి ప్రతీకగా విలసిల్లుతోంది. ఈ ఆలయం నేడు యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశాల జాబితాలో చేరింది. సునిశిత నైపుణ్యంతో చెక్కిన శిల్పాలు, చోళ కాంస్య విగ్రహాలు, ప్రాచీన శాసనాలకు ఈ ఆలయం ప్రసిద్ధి చెందింది.

చోళులు ఆదరించిన సుసంపన్న శైవభక్తి తత్వానికి ఆడి తిరువాతిరై వేడుక ఒక చిహ్నంగా నిలుస్తుంది.

## భక్తులకు గుడ్‌న్యూస్.. తిరుపతి-షిర్డీ మధ్య 18 స్పెషల్ రైళ్లు

తిరుపతి, జులై 28:భక్తులకు ఐఆర్‌సీటీసీ గుడ్ న్యూస్ చెప్పింది. ప్రముఖ పుణ్యక్షేత్రాలైన తిరుపతి, షిర్డీ మధ్య ప్రత్యేక రైలు సర్వీసులను నడిపించాలని దక్షిణ మధ్య రైల్వే నిర్ణయించింది. ఈ రెండు సిటీల మధ్య 18 ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు ప్రకటించింది. ఆగస్టు 3వ తేదీ నుంచి సెప్టెంబర్ 29 వరకు ఈ రైల్వే సర్వీసులు అందుబాటులో ఉంటాయని తెలిపింది.

ప్రతి ఆదివారం ఉదయం 4 గంటలకు తిరుపతి నుంచి తిరుపతి-సాయినగర్ షిర్డీ రైలు (07637) బయల్దేరి, మరుసటి రోజు ఉదయం 40.45 గంటలకు షిర్డీ చేరుకోనుంది.ప్రతి సోమవారం రాత్రి 7.35 గంటలకు షిర్డీ-తిరుపతి రైలు (07638) బయల్దేరి, మంగళవా రం అర్ధరాత్రి 1.30 గంటలకు తిరుపతి చేరుకోనుంది

రేణిగుంట, గూడూరు, నెల్లూరు, ఒంగోలు, చీరాల, తెనాలి, గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నడికుడి, మిర్యాలగూడ, నల్గొండ, సికింద్రాబాద్, లింగంపల్లి, వికారాబాద్, జహీరాబాద్, బీదర్, బాల్కి, ఉద్గిర్, లాతూర్ రోడ్డు, పర్లి, గంగఖేర్, పర్బని, సేలు, జాల్నా, ఔరంగాబాద్, నాగర్‌సోల్, మన్‌మడ్, కోపర్‌గావ్ స్టేషన్లలో ఆగనుంది.

## ప్రజావాణి అర్జీలకు వాట్సాప్ నంబర్

హైదరాబాద్, జులై 28: కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిని ప్రజలందరూ సద్వినియోగం చేసుకునేందుకు వాట్సాప్ నంబర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు కలెక్టర్ హరిచందన దాసరి తెలిపారు. వృద్ధులు, దివ్యాంగులతో పాటు కలెక్టరేట్‌కు రాలేని వారు తమ అర్జీలను వాట్సాప్ నంబర్ 7416687878కు వాట్సాప్ చేయవచ్చని చెప్పారు.

ఈ వెసులుబాటు ద్వారా సీనియర్ సిటిజన్లు, ఉద్యోగులు, దినసరి కూలీలు తమ విధులకు ఆటంకం కలుగకుండా ఇంటి నుంచే దరఖాస్తులను పంపవచ్చని చెప్పారు. అర్జీదారులు వ్యయ ప్రయాసల కోర్చి కలెక్టరేట్‌కు రాకుండా వాట్సాప్ ద్వారా పంపిస్తే తమ సిబ్బంది వాటిని డౌన్‌లోడ్ చేసుకుని ప్రత్యేక పోర్టల్‌లో నమోదు చేసుకుని ఒక ఐడీ నంబర్ కేటాయించి అర్జీ అందినట్లు సమాచారం వచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు.

### విజయవాడ వెళ్లే ప్రయాణికులకు బంపరాఫర్.. టీజీఎస్‌ఆర్టీసీ బస్సులో 30 శాతం డిస్కౌంట్!

హైదరాబాద్, జులై 28: విజయవాడ మధ్య రాకపోకలు సాగించే ప్రయాణికులకు టీజీఎస్‌ఆర్టీసీ బంపరాఫర్ ప్రకటించింది. ఆయా బస్సుల్లో టికెట్ ధరలపై 16 నుంచి 30 శాతం వరకు రాయితీని కల్పించింది. ఈ మేరకు ఆ వివరాలను టీజీఎస్‌ఆర్టీసీ ట్విట్టర్(ఎక్స్) ఖాతాలో వెల్లడించింది.

గరుడ ప్లస్ బస్సుల్లో 30 శాతం తగ్గింపు, ఈ గరుడ బస్సుల్లో 26 శాతం డిస్కౌంట్ టీజీఎస్‌ఆర్టీసీ కల్పించింది. ఇక సూపర్ లగ్జరీ, లహరి నాన్ ఏసీ బస్సుల్లో 20 శాతం వరకు తగ్గింపునిచ్చింది.

# ఇంద్రకీలాద్రిపై సెప్టెంబర్ 22 నుంచి దసరా మహోత్సవాలు : ఈవో వీకే శీనానాయక్

**-అక్టోబర్ 2 వరకు 11రోజుల పాటు వైభవంగా ఉత్సవాల నిర్వహణ..**
**-11రోజులు.. 11 అలంకారాలు**
**-10 సంవత్సరాల తర్వాత కాత్యాయని దేవి అవతారం**
**-మూలా నక్షత్రం రోజున సీఎం పట్టు వస్త్రాలు సమర్పణ**

అమరావతి, జులై 28:దేశ విదేశాలతో పాటు సుదూర ప్రాంతాల నుండి కనకదుర్గమ్మ వారి దర్శనానికి వచ్చే సామాన్య భక్తులకే తొలి ప్రాధాన్యత ఇస్తున్నట్లు శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం కార్యనిర్వాహణాధికారి వీకే శీనా నాయక్ ప్రకటించారు. ఇంద్రకీలాద్రి పై శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో కనకదుర్గమ్మ అమ్మవారి దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను సెప్టెంబర్ 22వ తేదీ నుంచి అక్టోబర్ 2 వరకు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.

సెప్టెంబర్ 22 నుంచి ఇంద్రకీలాద్రిపై నిర్వహించనున్న దసరా మహోత్సవాల నిర్వహణపై సోమవారం కార్యనిర్వహణ అధికారి వీకే శీనానాయక్.. వైదిక కమిటీ సభ్యులు, వేదపండితులతో కలిసి మీడియా ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దసరా ఉత్సవాలకు సంబంధించి శుభ ఆహ్వాన పత్రికను విడుదల చేశారు. అనంతరం ఈవో మాట్లాడుతూ శ్రీ విశ్వావసు నామ సంవత్సర దసరా మహోత్సవాలను సెప్టెంబర్ 22నుంచి అక్టోబర్ 2 వరకు నిర్వహించాలని వైదిక కమిటీ నిర్ణయించినట్లు ఆయన తెలిపారు.

దసరా మహోత్సవాలకు రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాలు, దేశవిదేశాల నుంచి పెద్దఎత్తున భక్తులు అమ్మవారి దర్శనానికి తరలివస్తారన్నారు. భక్తుల మనోభావాలకు అనుగుణంగా సాధారణ భక్తులకు అమ్మవారి దర్శనం త్వరితగతిన జరిగేలా ఏర్పాట్లు చేసేందుకు ప్రణాళికలను రూపొందిస్తున్నామని, ఇందుకు సంబంధించి జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. దేవాదాయ శాఖ మంత్రి, కమిషనర్, ఇతర ఉన్నతాధికారుల సూచనలు, సలహాలను పరిగణనలోకి తీసుకొని దసరా ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు.

11 అలంకరణల్లో అమ్మవారు..

ఈ ఏడాది నిర్వహించే దసరా శరన్నవరాత్రి ఉత్సవాలలో కనకదుర్గమ్మ వారు 11 అలంకరణలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నట్లు ఆలయ స్థానాచార్యులు విష్ణుభట్ల శివ ప్రసాద్ శర్మ తెలిపారు. అమ్మవారి అలంకరణ విషయాలపై ఆయన మాట్లాడుతూ? దసరా శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా శ్రీ విశ్వావసు నామ సంవత్సరంలో నిర్వహించే ఉత్సవాల్లో అమ్మవారు 11 రోజులపాటు 11 అవతారాల్లో

భక్తులకు దర్శనమిస్తారన్నారు.

22వ తేదీన ఆశ్వీయుజ శుద్ధ పాడ్యమి నాడు అమ్మవారు శ్రీ బాలా త్రిపుర సుందరీ దేవి అలంకారంతో దసరా ఉత్సవాలు ప్రారంభమవుతాయని..

23వ తేదీన శ్రీ గాయత్రీ దేవి
24వ తేదీన శ్రీ అన్నపూర్ణాదేవి
25వ తేదీన శ్రీ కాత్యాయని దేవి
26వ తేదీన శ్రీ మహాలక్ష్మి దేవి
27వ తేదీన శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవి
28వ తేదీన శ్రీమహా చండీ దేవి
29వ తేదీన మూలా నక్షత్రం రోజున శ్రీ సరస్వతీ దేవి
30వ తేదీన శ్రీ దుర్గాదేవి
అక్టోబర్ 1న శ్రీ మహిషాసురమర్దినీ దేవి
అక్టోబర్ 2న విజయదశమి రోజున శ్రీ రాజరాజేశ్వరి దేవి అలంకారంలో అమ్మవారు దర్శనమిస్తారని వివరించారు.

మూలా నక్షత్రం రోజున రాష్ట్ర ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారన్నారు. అక్టోబర్ 2వ తేదీన విజయదశమి రోజున ఉదయం మహా పూర్ణాహుతి, సాయంత్రం పవిత్ర కృష్ణా నదిలో తెప్పోత్సవం జరుగుతుందన్నారు. ఏటా మాదిరిగానే అర్చక సభలు, వేద సభలు నిర్వహిస్తామని, ప్రతిరోజు నగరోత్సవం జరుగుతాయని శివ ప్రసాద్ శర్మ, ఆలయ స్థానాచార్య మరియు వైదిక కమిటీ సభ్యులు వివరించారు. మీడియా ప్రతినిధుల సమావేశంలో ఆలయ ప్రధాన అర్చకులు, వైదిక కమిటీ సభ్యులు ఎల్.దుర్గా ప్రసాద్ వైదిక కమిటీ సభ్యులు చింతపల్లి ఆంజనేయ ఘనాపాటి, వి ఎస్ మహర్షి ఘనాపాటి వేద పండితులు, వైది కమిటీ సభ్యులు, అర్చకులు శ్రీధర్ శర్మ ఆలయ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఇరువురు, ఎఈఒ లు వివిధ విభాగాల పర్యవేక్షకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆగస్టు 1న ఢిల్లీలో బీసీల ధర్నా




హైదరాబాద్, జులై 28: బీసీలకు ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 42 శాతం రిజర్వేషన్లను అమలు చేసి తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఆదివారం వెస్ట్ మారెడ్‌పల్లిలోని తమ కార్యాలయంలో బీసీ స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆగస్టు 1న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిర్వహించనున్న బీసీ ధర్నాకు సంబంధించిన పోస్టర్లను ఆయన విడుదల చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలసాని మాట్లాడుతూ ఇచ్చిన హామీలను అమలు చేయకుండాప్రజలను మభ్యపెట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని విమర్శించారు. 42 శాతం రిజర్వేషన్‌కు చట్టబద్ధత కల్పించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలకు నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. బీసీ స్టూడెంట్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు సైదులు యాదవ్, నాయకులు అశోక్ యాదవ్, రమేశ్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

# పచ్చదనం నింపడమే గ్రీన్ ఇండియా లక్ష్యం

**-మాజీ రాజ్యసభ సభ్యుడు జోగినపల్లి సంతోష్ కుమార్**
**-కీసరలో ఘనంగా 8వ ఎడిషన్ ప్రారంభం**



హైదరాబాద్, జులై 28: నా జీవితాంతం మొక్కలు నాటే కార్యక్రమాన్ని కొనసాగించాలన్న ఉద్దేశ్యంతో గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌ను ప్రారంభించనని మాజీ రాజ్యసభ సభ్యులు జోగినపల్లి సంతోష్‌కుమార్ తెలిపారు. గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో భాగంగా ఆదివారం కీసరగుట్టలో సంతోష్‌కుమార్, మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే చామకూర మల్లారెడితో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సంతోష్‌కుమార్ మాట్లాడుతూ.. గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌ను మరింత ముందుకు తీసుకెళ్లాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

ఏడు వసంతాలు విజయవంతంగా ముందుకెళ్తున్న గ్రీన్ ఇండియా ఛాలెంజ్ ఎనిమిదవ ఎడిషన్ ఘనంగా ప్రారంభమైందన్నారు.

భారతదేశాన్ని పచ్చదనంతో నింపాలన్న లక్ష్యంతోనే ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందని.. ఒకరు మూడు మొక్కలు నాటి మరో ముగ్గురికి ఛాలెంజ్ విసరగా నేడు 20 కోట్లకు పైగా మొక్కలు నాటే బృహత్తర కార్యక్రమం అయ్యిందని హర్షం వ్యక్తం చేశారు.

సామాన్యుల నుంచి సినీ ప్రముఖులు, కవులు, కళాకారులు, రాజకీయ నాయకులు ఇలా ప్రతి ఒక్కరు ఒక యజ్ఞంలా ఈ కార్యక్రమంలో భాగస్వాములు అయ్యారని తెలిపారు.

తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ స్ఫూర్తితో ఈ యజ్ఞంను ప్రారంభించామని, నా జీవితాంతం ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తామన్నారు

. కీసరలో ఫారెస్ట్ ల్యాండ్‌ను దత్తత తీసుకొని దాని అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని అన్నారు. మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి మాట్లాడుతూ.. సంతన్న అంటేనే హరితహారం, సంతన్న అంటే గ్రీన్ ఇండియా ఛాలెంజ్ అన్నారు.

సంతోష్ చేపట్టిన గ్రీన్ ఇండియా కార్యక్రమాన్ని పార్లమెంట్‌లో కూడా ప్రశంశించారని మల్లారెడ్డి తెలిపారు.

## స్వామి సేవలో మాజీ ఎంపీ, ఎమ్మెల్యేలు..

అనంతరం కీసరగుట్ట శ్రీ భవానీ రామలింగేశ్వరస్వామివారిని మాజీ రాజ్యసభ సభ్యులు జోగినపల్లి సంతోష్‌కుమార్, ఎమ్మెల్యే మల్లారెడ్డి దర్శించుకున్నారు. :

ఆలయ చైర్మన్ తటాకం నారాయణశర్మ, ఆలయ వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి సన్మానించారు.

ఈ కార్యక్రమంలో కీసర మాజీ సర్పంచ్ నాయకపు మాధురి వెంకటేశ్, జవహర్‌నగర్ మాజీ మేయర్ కావ్య, దమ్మాయిగూడ మున్సిపల్ మాజీ చైర్మన్ ప్రణీతగౌడ్, బీఆర్ఎస్ నేతలు నాయకపు వెంకటేశ్ ముదిరాజ్, గుర్రం శ్రీధర్‌రెడ్డి, రాగుల రమేశ్ ముదిరాజ్, తటాకం భానుశర్మ తదితరులు పాల్గొన్నారు.

## జీఎస్ఆర్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

కీసరకు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నేత గుర్రం శ్రీధర్‌రెడ్డి యువతలో నూతన ఉత్తేజాన్ని నింపడానికి క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నారు. ఈ మేరకు మాజీ ఎంపీ సంతోష్‌కుమార్, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి జీఎస్ఆర్ ఆధ్వర్యంలో సెషన్-2 ఫైనల్ మ్యాచ్ క్రికెట్ టోర్నమెంట్‌ను లాంఛనంగా ప్రారంభించారు. గుర్రం శ్రీధర్‌రెడ్డి చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని ప్రశంసించారు.

26:

# రామచంద్రాపురంలో శ్రీ స్నేహ బి హెచ్ ఈ ఎల్ లేక్ వ్యూ రెసిడెన్సీలో ఉచిత డెంటల్ క్యాంప్




హైదరాబాద్ జూలై 28 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రామచంద్రాపురంలో శ్రీ స్నేహ బి హెచ్ ఈ ఎల్ లేక్ వ్యూ రెసిడెన్సిలో "డాక్టర్ సునయన వైట్ అండ్ బ్రైట్ డెంటల్ క్లినిక్" వారు ఉచిత డెంటల్ క్యాంప్ నిర్వహించారు. ఆదివారము ఉదయం రెసిడెన్సి లోని పెద్దల చేతుల మీదుగా ప్రారంభమైన ఈ ఉచిత డెంటల్ క్యాంప్ సాయంత్రం వరకు కొనసాగింది. డాక్టర్ వల్స సునయన ఓఆూ - ఖతీనీబబిష్ణనీటనీనిబితిబబి ఉ ఎఎజూ శ్రీ జీనిబినీ శ్రీ నీణతిబబి నేతృత్వంలో వైద్యుల బృందం అపార్ట్మెంట్ వాసులకు దంత వైద్య పరీక్షలు నిర్వహించి దంత సంరక్షణకు సంబంధించిన పలు సూచనలు చేశారు . ఉచితంగా మందులు పంపిణీ చేయడంతో పాటు మొదటి వందమందికి బ్రష్ పేస్టు తో కూడిన సెట్టును అందజేశారు. ఈ డెంటల్ క్యాంపులో తెలంగాణ గెజిటెడ్ హెడ్మాస్టర్స్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండం మోహన్ రెడ్డి దంత పరీక్షలు చేయించుకొని తమ రెసిడెన్సీలో ఉచిత డెంటల్ క్యాంప్ ఏర్పాటుచేసిన డాక్టర్ సునయన బృందాన్ని అభినందించారు. ఈ క్యాంపులో డాక్టర్ సునయనతో పాటు డాక్టర్ శ్రద్ధ, డాక్టర్ సింధు, డాక్టర్ సలేహా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సిబ్బంది సరిత,రామా హరికృష్ణ , డాక్టర్ వలస పైడి, అపార్ట్మెంట్ పెద్దలు గుప్తా తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ అధ్యక్షుడు, కె. చంద్రశేఖర్ రావుకు పార్టీని నడిపే ఓపిక, శక్తి లేకనే విశ్రాంతి

## - కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ అన

హైదరాబాద్ జూలై 28 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );బిఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావుకు పార్టీని నడిపే ఓపిక, శక్తి లేకనే విశ్రాంతి తీసుకుంటున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ అన్నారు. కెసిఆర్‌ను కాపాడే శక్తులు లేవు, బిఆర్ఎస్‌ను బతికించుకునే పరిస్థితులూ లేవని ఆయన తెలిపారు. కెసిఆరే చేతులెత్తేసిన తర్వాత ఇక మీతో ఏమి అవుతుంది? అని ఆయన ఆదివారం విలేకరుల సమావేశంలో బిఆర్ఎస్ నాయకులు, మాజీ మంత్రులైన టి. హరీష్ రావు, కె. తారక రామరావునుద్దేశించి ప్రశ్నించారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిని తక్కువ చేసి మాట్లాడడం భావ్యం కాదన్నారు. మీ భాషను మార్చుకోకపోతే బి?టీం వస్తదని, అప్పుడు తట్టుకోలేరని ఆయన హెచ్చరించారు. గత ఎన్నికల్లోనే బిఆర్ఎస్‌ను ప్రజలు బండకేసి బాదారని ఆయన తెలిపారు. కాలం చెల్లిన బిఆర్ఎస్‌ను బతికించుకోవడం మీ వల్ల కాదన్నారు. ఇంకా వంద మంది కెసిఆర్‌లు వచ్చినా బిఆర్ఎస్‌ను బతికించుకోవడం కష్టమని అద్దంకి వ్యాఖ్యానించారు.

# దశాబ్దకాలం తర్వాత నిజమైన తెలంగాణ పోరాట యోధులను గుర్తింపు

## -సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోనే అసలైన ఉద్యమకారులకు న్యాయం

## -తెలంగాణ ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

## -ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ కు తెలంగాణ జాతిపిత ప్రొఫెసర్ జయశంకర్ స్మారక పురస్కారం

## -రవీంద్రభారతిలో కన్నుల పండువగా తెలంగాణ సన్మాన్ పురస్కారాల ప్రధానోత్సవం



హైదరాబాద్, జూలై 28 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );:దశాబ్ద కాలం తర్వాత నిజమైన తెలంగాణ పోరాట యోధులకు గుర్తింపు లభించడం అభినందనీయమని తెలంగాణ ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు.ఆదివారం తెలంగాణ కల్చరల్ ఫౌండేషన్ అధ్యక్షులు నారగౌని పురుషోత్తం నేతృత్వంలో రవీంద్రభారతిలో తెలంగాణ సన్మాన్ 2025 పురస్కార ప్రధానోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, తెలంగాణ కల్చరల్ ఫౌండేషన్ సంయుక్తాధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి బీర్ల ఐలయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ కు తెలంగాణ జాతిపిత ప్రొఫెసర్ జయశంకర్ స్మారక పురస్కారాన్ని బీర్ల ఐలయ్య చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల విద్యాలయ సంస్థ జాయింట్ సెక్రెటరీ శ్యాం ప్రసాద్ లాల్ సభకు అధ్యక్షత వహించారు. భాషాభివృద్ధి సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ గౌరవ అతిథిగా హాజరయ్యారు. తెలంగాణ ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ఇటిక్యాల పురుషోత్తం ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. తెలంగాణ బీసీ కమిషన్ సభ్యురాలు రంగు బాలలక్ష్మికి వీరనారి చిట్యాల ఐలమ్మ స్మారక పురస్కారాన్ని అందజేశారు. వీరితో పాటు సీనియర్ ఫిలిం క్రిటిక్ పొన్నం రవిచంద్రకు పైడి జయరాజ్ స్మారక పురస్కారం, ప్రముఖ గాయకులు దరువు అంజన్నకు ప్రజా యుద్ధ నౌక గద్దర్ స్మారక పురస్కారం, సీనియర్ పాత్రికేయులు కాసుల ప్రతాపరెడ్డికి తెలంగాణ వైతాళికుడు సురవరం ప్రతాపరెడ్డి స్మారక పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోనే అసలైన ఉద్యమకారులకు గుర్తింపు లభిస్తోందని అన్నారు. పది సంవత్సరాలుగా ఉద్దేశపూర్వకంగా అనగదొక్కిన కవులు, కళాకారులకు అసలైన గుర్తింపు లభిస్తుందని ఆయన అన్నారు. దొరల గడీలకు భజన చేసే కళాకారులకు తప్ప అసలైన ఉద్యమకారులకు గుర్తింపు లభించలేదని అన్నారు. వివిధ కార్యక్రమాల ద్వారా వారిని గుర్తించి ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. కేవలం తనకు వంత పాడలేదన్న ఉద్దేశంతో కెసిఆర్ దూరం పెట్టిన వారందరిని సీఎం రేవంత్ రెడ్డి గుర్తించి వారి అభిప్రాయాలు ఎలా ఉన్నా సరే ఉద్యమంలో వారు చేసిన పనిని గుర్తించి ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. ప్రొఫెసర్ జయశంకర్ అవార్డు గ్రహీత ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ మాట్లాడుతూ తెలంగాణ కల్చరల్ ఫౌండేషన్ స్థాపించి నాటి అసలు సిసలైన తెలంగాణ ఉద్యమకారులకు గుర్తింపు నిస్తూ ప్రోత్సహించే విధంగా కృషి చేయడం అభినందనీయమని అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ సార్ పేరిట అవార్డు ఇవ్వడంతో తన బాధ్యతను పెంచిందని, ఈరోజు నుంచి మరింత జాగ్రత్తతో తన విధులు నిర్వర్తిస్తానని ఆయన అన్నారు. బీసీ కమిషన్ సభ్యురాలు, చాకలి ఐలమ్మ పురస్కార గ్రహీత రంగు బాలలక్ష్మి మాట్లాడుతూ చాకలి ఐలమ్మ పుట్టిన గడ్డ నుంచి తాను రావడం, ఉస్మానియా యూనివర్సిటీలో చదువుకుంటూ ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడడం..., సాధించిన రాష్ట్రంలో వివక్షతను ఎదుర్కొంటూ దశాబ్ద కాలం తర్వాత ఇటువంటి సన్మానాన్ని అందుకోవడం సంతోషకరమని అన్నారు. పైడి జయరాజు పురస్కార అవార్డు గ్రహీత పొన్నం రవిచంద్ర మాట్లాడుతూ దాదాసాహెబ్ అవార్డు పొందిన పైడి జయరాజును తెలుగు చలనచిత్ర రంగం పరిశ్రమ అనేక దశాబ్దాలుగా విస్మరించిందని, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా ఆయన సేవలు గుర్తించలేదని సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోనే అలా మరుగున పడిపోయిన వారికి గుర్తింపు లభిస్తోందని అన్నారు.గద్దర్ అవార్డు గ్రహీత దరువు అంజన్న మాట్లాడుతూ తెలంగాణ కోసం నిరంతరం కొట్లాడిన పోట్లాడిన గద్దర్ అన్న స్మారక అవార్డు తనకు లభించడం తనకెంతో చిరస్మరణీయమని తెలిపారు. పన్నెండ్లుగా గుర్తింపు లేని తమకు ఈ అవార్డు ఇవ్వడం గద్దర్ అన్నను స్మరించుకోనే విధంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం సంతోషకరమని అన్నారు. తెలంగాణ వైతాళికులు సురవరం ప్రతాపరెడ్డి స్మారక అవార్డు గ్రహీత కాసుల ప్రతాపరెడ్డి మాట్లాడుతూ ఆ మహనీయుని పేరిట తనకు అవార్డు ఇవ్వడం తెలంగాణ ఉద్యమంలో తనను గుర్తించడం ఎంతో బాధ్యత పెంచిందని అన్నారు. ఈ కార్యక్రమం లో సీనియర్ జర్నలిస్టు మెరుగు చంద్రమోహన్, తెలంగాణ ఉద్యోగుల సంఘం రాష్ట్ర సహాధ్యక్షులు కాలేరు సురేష్, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ సీనియర్ నాయకురాలు మెరుగు సునీత తదితరులు పాల్గొన్నారు.

# పార్టీ విస్తృతే లక్ష్యంగా కార్యాచరణ

## -అభినందన సభలో దండిసురేష్

ఖమ్మం, జూలై 28 (నేటినిజం ప్రతినిధి) : ప్రజాసమస్యల పరిష్కారం



పార్టీ విస్తృతే లక్ష్యంగా కార్యచరణ చేపట్టనున్నట్లు, సిపిఐ జిల్లా కార్యదరి దండి సురేష్ తెలిపారు. పార్టీ కార్యకర్తలను కర్మోనుకులను చేయటం ద్వారా పార్టీ విస్తరణకు మార్గం సుగమం అవుతుందన్నారు. ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని కొత్తగూడెం శాఖ అద్వర్యంలో సిపిఐ జిల్లా కార్యదర్శి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి కి సన్మాన అభినందన సభ సోమవారం జరిగింది. జిల్లా కార్యవర్గ సభ్యులు వగడాల మల్లేష్, రావుల హనుమంతరావు అధ్యక్షతన జరిగిన సభలో దండి సురేష్ మాట్లాడుతూ... ఖమ్మం జిల్లాలో కమ్యూనిస్టు పార్టీకి బలమైన నిర్మాణం ఉందని, అనేక చారిత్రక పోరాటాలు నిర్వహించిన ఘనత సిపిఐకి

ఉందన్నారు. పాలకులు ప్రజాసమస్యల పరిష్కారం కంటే ప్రజులను వంచించేందుకు ప్రాధాన్యత నిస్తూన్నారని సురేష్ ఆరోపించారు. బీజేపి ఏకంగా రాజ్యాంగాన్ని మార్చేందుకు ప్రయత్నిస్తుందని కమ్యూనిస్టు లంగా బిజెపి విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు.

మోడీ పాలన లో దేశం తిరోగమనంలో పయనిస్తుందని, ప్రజల్ని మతం మత్తులో ఉంచేందుకు ప్రయత్నిస్తున్నదని సురేష్ తెలిపారు. ప్రజాసమస్యలకు మతం పరిష్కారం చూపదన్నారు. బీఆర్ఎస్ విధానాలకు విసిగిపోయిన తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ కు అధికారం అప్పగించారని ప్రజల ఆశలను ఆకాంక్షలను నెరవేర్చాల్సిన బాధ్యత ప్రభుత్వం పై ఉందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చుడం ద్వారా కాంగ్రెస్ ప్రజాభిమానం చురగోనాలన్నారు. హామీలను అమలు చేయకుంటే ఆందోళన తప్పదని సురేష్ హెచ్చరించారు. డిసెంబర్ 26న జరిగే శతవసంతాల ముగింపు బహిరంగ సభను పెద్దఎత్తున విజయవంతం చేయటం ద్వారా పార్టీకి పునర్ వైభవం తీసుకురావాలని సురేష్ పిలుపునిచ్చారు. ఈ సభ లో జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి తదితరులు ప్రసంగించగా, ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు బిజెపి క్లైమేట్, మిడికంటి వెంకటరెడ్డి, మేకల శ్రీనివాసరావు, ఏనుగు గాంధీ జిల్లా కౌన్సిల్ సభ్యులు గాదె లక్ష్మీనారాయణ, మాడుగుల నాగేశ్వరావు, జాకీరుద్దీన్, చింతకాయల వెంకటేశ్వర్లు, బొమ్మిశెట్టి రామనాథం, జొన్నలగడ్డ వెంకటేశ్వర్లు, వరద నరసింహారావు, మాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు.

# మా ఆర్థిక వ్యవస్థను స్విచ్ఛాఫ్ చేసుకోవాలా..?

## -రష్యా చమురు కొనుగోలు విషయంలో పశ్చిమ దేశాలపై మండిపడ్డ భారత్

న్యూ డిల్లీ జూలై 28 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);ఉక్రెయిన్‌తో యుద్ధం నేపథ్యంలో రష్యాపై పశ్చిమ దేశాలు పలు ఆంక్షలు ఉన్నప్పటికీ మాస్కో నుంచి భారత్ పెద్ద ఎత్తున చమురు దిగుమతి చేసుకుంటోంది. ఈ నేపథ్యంలో రష్యా చమురు దిగుమతి చేసుకోవడంపై పశ్చిమ దేశాలు అభ్యంతరం వ్యక్తం చేస్తూ వస్తున్నాయి. దీనిపై తాజాగా భారత్ స్పందించింది. పశ్చిమ దేశాల విమర్శలను యూకేలోని భారత హైకమిషనర్ విక్రమ్ దొరైస్వామి తోసిపుచ్చారు. ఏ దేశం కూడా తమ ఆర్థిక వ్యవస్థను ఆపేయాలని అనుకోదని వ్యాఖ్యానించారు.బ్రిటిష్ రేడియో స్టేషన్ టైమ్స్ రేడియోతో దొరైస్వామి మాట్లాడుతూ.. భారత్ ప్రపంచంలోనే మూడో అతిపెద్ద చమురు దిగుమతిదారు అని తెలిపారు. దేశ అవసరాల్లో 80 శాతం దిగుమతులపైనే అధారపడుతున్నట్లు చెప్పారు. రష్యా నుంచి చౌక ధరకు చమురు దిగుమతి చేసుకుంటున్నట్లు తెలిపారు. అవసరాల మేరకు డిస్కౌంట్‌పై చమురును ఎలా కొనుగోలు చేయకుండా ఉంటాం..? అని ప్రశ్నించారు. పశ్చిమ దేశాలు భారత్‌పై విమర్శలు చేస్తున్నాయన్నారు. 'మేం ఏం చేయాలని పశ్చిమ దేశాలు కోరుకుంటున్నాయి..? మా ఆర్థిక వ్యవస్థను స్విచ్ఛాఫ్ చేసుకోవాలా..?' అంటూ ప్రశ్నించారు.

# బిఆర్ఎస్ పార్టీని బిజెపిలో విలీనం చేస్తానన్న కవిత మాటాలకు కెటిఆర్ సమాధానం చెప్పాలి

## -ఎంఎల్ఏ నాయిని రాజేందర్ రెడ్డి డిమాండ్

హైదరాబాద్ జూలై 28 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: బిఆర్ఎస్ పార్టీని బిజెపిలో విలీనం చేస్తానన్న కవిత మాటాలకు కెటిఆర్ ఎందుకు సమాధానం చెప్పాలని ఎంఎల్ఏ నాయిని రాజేందర్ రెడ్డి డిమాండ్ చేసారు. ఎంఎల్సి కవితను జైలు నుంచి బయటకు తీసుకరావడానికి బిజెపి వాళ్ల కాళ్లను కెటిఆర్ పట్టుకున్నారని రాజేందర్ రెడ్డి ఆరోపణలు చేశారు. సొంత చెల్లి కవిత విభేదించడం కన్నా పెద్ద సాక్ష్యాలు కావాలా? అని ప్రశ్నించారు. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌కు నాయిని రాజేందర్ రెడ్డి సవాల్ విసిరారు. ఉమ్మడి వరంగల్ జిల్లాను ఎవరు అభివృద్ధి చేశారో ప్రజల సమక్షంలో తేల్చుకుందామని కెటిఆర్ కు ఓపెన్ ఛాలెంజ్ చేశారు. తాను చెప్పింది తప్పయితే ముక్కు నేలకు రాస్తానని, లేదంటే రాజకీయాల నుంచి కెటిఆర్ తప్పుకోవాలని డిమాండ్ చేశారు. వరంగల్‌ను పదేళ్ల చేసిన అభివృద్ధి కంటే 18 నెలల్లో తాము ఎక్కువగా అభివృద్ధి చేశామని రాజేందర్ రెడ్డి స్పష్టం చేశారు.

# కెమెరా లేకుండానే వ్యక్తులను గుర్తించే హూ-ఫై!

## -సరికొత్త నిఘా టెక్నాలజీ అభివృద్ధి

న్యూఢిల్లీ జూలై 28 (ఎక్స్ ప్రెస్ న్యూస్); : ఎలాంటి కెమెరాలు అవసరం లేకుండా, విజువల్ ఇన్‌పుట్‌తో పనిలేకుండా వ్యక్తులను గుర్తించే హైటెక్ నిఘా టెక్నాలజీని ఇటలీ పరిశోధకులు అభివృద్ధి చేశారు. ఏఐతో పనిచేసే ఈ సాంకేతికతతో వ్యక్తులను, వారి కదలికలను గుర్తించవచ్చని పరిశోధకులు తెలిపారు. ఈ టెక్నాలజీని హూ-పె(Who-Fi )గా వ్యవహరిస్తున్నారు. సాధారణ వైఫై సిగ్నల్‌ని బయోమెట్రిక్ స్కానర్‌గా ఇది మారుస్తుందని వెల్లడించారు. ఫింగర్‌ప్రింట్ స్కానర్, ఫేషియల్ రికగ్నిషన్ వంటి సంప్రదాయ బయోమెట్రిక్ సిస్టమ్స్ మాదిరిగా దీనికి ఫిజికల్ కాంటాక్ట్, విజువల్ ఫీడ్ అవసరం లేదు. కేవలం వైఫై సిగ్నల్స్ ద్వారా ఇది పనిచేస్తుంది.

వైఫై సిగ్నల్స్‌ని వ్యక్తి అడ్డుకునే తీరును బట్టి ఈ హూ-ఫై టెక్నాలజీతో ఆ వ్యక్తిని గుర్తించవచ్చని పరిశోధకులు తెలిపారు. వైఫై సిగ్నల్స్ సమీపంలోకి వ్యక్తి వచ్చినప్పుడు, సిగ్నల్ సహజంగా ప్రయాణించే మార్గంలో ఆటంకాలు ఏర్పడతాయి. ఫలితంగా ఒక యూనిక్ ప్యాటర్న్ ఏర్పడుతుంది. చేతి వేలిముద్రలు, ముఖ కవళికలు, రెటీనా నిర్మాణం వంటి బయోమెట్రిక్ సిగ్నేచర్స్ మాదిరిగానే ఇది అత్యంత కచ్చితంగా ఉంటుంది. హూ-ఫై సిస్టమ్ ఈ సిగ్నేచర్‌ను గుర్తించి, వ్యక్తులకు ఆపాదిస్తుంది. ఈ సిగ్నేచర్స్‌పై ఒకసారి దీనికి శిక్షణ ఇస్తే, ఆ వ్యక్తి కదలికలను కనిపెట్టడం మాత్రమే కాకుండా, సుదీర్ఘ కాలం గడచిపోయిన తర్వాత ఆ వ్యక్తి ఆ నెట్‌వర్క్ జోన్‌లోకి తిరిగి ప్రవేశించినపుడు కూడా గుర్తించగలదు. కెమెరాలు, మైక్రోఫోన్లు వంటివాటిని ఉపయోగించవలసిన అవసరం ఉండదు.హూ-ఫై సిస్టమ్‌కు సింగిల్ యాంటెన్నా ట్రాన్స్‌మిటర్, త్రీ-యాంటెన్నా రిసీవర్ ఉంటే సరిపోతుంది. అంటే, దీని కోసం ఖర్చు కూడా తక్కువే. టార్గెట్ ఓ గోడ వెనుక ఉండి, సాధారణ వేగంతో నడుస్తున్నప్పుడు, హూ-ఫై సిస్టమ్ 95.5 శాతం కచ్చితత్వంతో గుర్తించగలిగిందని పరిశోధకులు చెప్పారు. ఆ వ్యక్తి బట్టలు మార్చినా, బ్యాక్‌ప్యాక్ ధరించినా ఈ కచ్చితత్వం మారలేదన్నారు.

# ఎంఐఎం పార్టీ చొరవతో ముస్లిం డివిజన్లలో వందల కోట్ల అభివృద్ధి

## -ఎంఐఎం నేతలు చేసిన సైకిళ్ల పంపిణీ చూసి బండి సంజయ్ కాపీ

## -ఎంఐఎం పార్టీ కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్




కరీంనగర్, జులై 28: సెక్యులర్ వాదుల దేశభక్తిని నిత్యం శంకించే బిజెపి, ఆర్ఎస్ఎస్, సంఘపరివార్ నాయకులు, ముస్లింలను బూచిగా చూపిస్తూ, హిందువులను ఓటు బ్యాంకుగా మాత్రమే మార్చుకొని రాజకీయ లబ్ధి పొందుతున్నారని, స్వాతంత్రం వచ్చిన నాటి నుండి, నేటి వరకు పేదల కోసం తమ సొంత డబ్బులతో ఒక్క స్కూల్ కట్టించి, నిరుపేద విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపిన దాఖలాలు కనిపించవని, ఎంఐఎం పార్టీ కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ విమర్శించారు. ఎంఐఎం అధినేత బారిష్టర్ అసదుద్దీన్ ఓవైసీ ఆదేశాల మేరకు, ఆదివారం రాత్రి నగరంలోని కశ్మీర్ గడ్డలోని ఓఫంక్షన్ హాల్లో 43, 61వ డివిజన్ల బాధ్యులు బర్కత్ అలీ, ఆతిన ఆధ్వర్యంలో 200మంది యువకులు, పెద్దలు ఎంఐఎంలో చేరారు. పార్టీలో చేరిన యువకులకు కండువాలు కప్పి గులాం అహ్మద్ ఎంఐఎంలోకి ఆహ్వానించారు. అనంతరం నిర్వహించిన రెండు డివిజన్ల స్థాయి సదస్సులో గులాం అహ్మద్ మాట్లాడుతూ ఎంఐఎం పార్టీ శాసనసభ పక్ష నేత అక్బరుద్దీన్ ఓవైసీ నిరుపేదల కోసం విద్యాసంస్థలను స్థాపించి, ఉచితంగా ప్రతి ఏడాదికి 22000 మంది విద్యార్థులను చదివిస్తున్నారని చెప్పారు. ఇలాంటి మంచి పనులను నాటి జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ మొదలుకొని, నేటి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, అమిత్ షా, బండి సంజయ్ వరకు పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్యను అందించేందుకు, తమ సొంత డబ్బులతో ఒక్క స్కూల్ ను నిర్మించారా అని ప్రశ్నించారు. గోదాం గడ్డలో గత రెండేళ్ల క్రితం ఎంఐఎం పార్టీ కార్పొరేటర్ కుటుంబ సభ్యులు విద్యార్థుల కోసం ఉచితంగా సైకిళ్లను తమ సొంత డబ్బులతో పంపిణీ చేస్తే, అట్టి కార్యక్రమాన్ని కేంద్రమంత్రి బండి సంజయ్ కాపీ కొట్టారన్నారు. దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థల నుండి వచ్చే సీఎస్సార్ నిధుల (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) ద్వారా మాత్రమే బండి సంజయ్ సైకిళ్లను పంపిణీ చేశారన్నారు. ఈసైకిళ్లు మోడీ గిఫ్ట్ అని చెప్పడం, వాళ్లు పంపిణీ చేసే సైకిళ్లకు కాషాయపురంగు పులమడం ఎంతవరకు సమంజసమో సభ్య సమాజం ఆలోచించాలన్నారు. ఎంఐఎం పార్టీ చొరవతో నగరంలోని దళిత, ముస్లిం డివిజన్లలో స్మార్ట్ సిటీ ద్వారా వందల కోట్ల అభివృద్ధి పనులు జరగాయని పేర్కొన్నారు. కాశ్మీర్ గడ్డలో మోడల్ రైతు బజార్ నిర్మాణంతో పాటు గోదాం గడ్డలో మోడల్ దోబీ ఘాట్ నిర్మాణం ఎంఐఎం కృషి వల్లనే జరుగుతుందన్నారు. 2005-2006లో కాలంలో శానహాబ్ మొహల్లా నుంచి నగరంలోనే అత్యధికంగా 1280పైచిలుకు ఇందిరమ్మ ఇండ్ల స్థలాల పట్టాలు ఇప్పించిన ఘనత ఎంఐఎం కార్పొరేటర్ రాఫీయాసుల్తానా కే దక్కిందన్నారు. జగిత్యాలలో ఎంఐఎం కౌన్సిలర్ రజియుద్దీన్ కృషి ఫలితంగా 900డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ముస్లింలకు మంజూరయ్యాయని గుర్తు చేశారు. ఎంఐఎం పార్టీ విధి విధానాలకు ఆకర్షితులై యువకులు, సీనియర్ సిటిజన్స్ పెద్ద ఎత్తున పార్టీలో చేరుతున్నారన్నారు. రాబోయే రోజుల్లో పార్టీ బలోపేతం, విస్తరణ కోసం బారిష్టర్ అసదుద్దీన్ ఓవైసీ ఆదేశాల మేరకు చేరికలు కొనసాగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమీ, నాయకులు బర్కత్ అలీ, ఆతిన, ఖమరొద్దీన్, ఇబ్రహీం, అఖీల్ ఫిరోజ్, శర్ఫుద్దీన్, అలిబాబా, అజర్ దబీర్, అన్నేమల్ల సురేశ్, మొహసీన్, సాజిద్, అన్వర్ ఖాన్, ఖాజా మజహరొద్దీన్, అజ్మత్ అలీ, ఖాలీద్, నసీం ఖాన్, అశు, అబిద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

# కొత్తగూడెం భద్రాద్రి జిల్లా చర్ల మండలంలో మావోయిస్టుల పోస్టర్లు కలకలం.

కొత్తగూడెం భద్రాద్రి జూలై 28 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: కొత్తగూడెం భద్రాద్రి జిల్లా చర్ల మండలంలో మావోయిస్టుల పోస్టర్లు కలకలం సృష్టించాయి. మావోయిస్టు అమరవీరుల సభలు జరపాలని బ్యానర్లు, కరపత్రాలు కనిపించాయి. ఆర్.కొత్తగూడెం, దానవాయిపేటలో పోస్టర్లు వెలిశాయి. మావోయిస్టు అమరవీరుల స్తూపాలు నిర్మించాలని పిలుపునిచ్చాయి. మరో వైపు భూపాలపల్లిలో మావోయిస్టులకు వ్యతిరేకంగా పోస్టర్లు వెలిశాయి. ముకునూరు, నీలంపల్లి, బూరుగూడెంతో పాటు సర్వాయిపేట గ్రామాల్లో పోస్టర్లు వెలిశాయి. మావోయిస్టు అగ్రనేతలు కాలం చెల్లిన సిద్ధాంతాలు వీడి జన జీవన విధానంలో కలవాలంటూ పోస్టర్లు కనిపించాయి. మావోల మేధస్సును ప్రజల అభివృద్ధికి ఉపయోగించాలని పోస్టర్లలో ఉన్నాయి. మావోయిస్టు ఆత్మపరిరక్షణ-ప్రజాఫ్రంట్ పేరిట పోస్టర్లు ఉన్నాయి.

# రాజన్న ఆలయంలో స్నేక్ క్యాచర్ను నియమించాలి

## – వీహెచ్పి నేత గడప కిషోర్ రావు

రాజన్న సిరిసిల్ల, జులై 28:(నేటినిజం ప్రతినిధి): రాజన్న ఆలయంలో స్నేక్ క్యాచర్లను నియమించాలని వీహెచ్పి నేత గడప కిషోర్ రావు డిమాండ్ చేశారు. వర్షాకాలం సందర్భంగా తరచుగా పాములు భీమేశ్వరాలయం, పార్వతిపురం, భీమేశ్వర సదన్, లడ్డు కౌంటర్, పి ఆర్ ఓ ఆఫీస్, గోశాలలో పాములు సంచరించడం వల్ల భక్తులు భయభ్రాంతులకు లోన్ అవుతున్నాని అన్నారు. కావున స్నేక్ క్యాచర్లను



నియమించి భక్తులను, సిబ్బందిని పాము కాటు నుంచి రక్షించాలని కోరారు.

# వ్యవసాయరంగంపై కనీసం అవగాహన లేకుండా మాట్లాడడం విడ్డూరం

## – వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

హైదరాబాద్ జూలై 28 (ఎక్స్ ప్రెన్ న్యూన్ );: రాష్ట్రానికి యూరియా సరఫరా కొరతపై బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు



ఎన్.రామచంద్రరావు వ్యవసాయ రంగంపై కనీసం అవగాహన లేకుండా మాట్లాడడం విడ్డూరంగా ఉందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి యూరియా కేటాయింపులు, సరఫరా అంశాలపై అవగాహన లేకుండా, రాష్ట్ర రైతాంగాన్ని తప్పుదోవ పట్టించేలా మట్లాడడం సరికాదని మంత్రి తుమ్మల హితవు పలికా రు. ఆదివారం బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచంద్రరావుకు యూరియా సరఫరాకు సంబంధించి పూర్తి లెక్కలతో మంత్రి తుమ్మల లేఖ రాశారు. యూ రియాపై బిజెపివి అర్థంలేని మాటలని ఆయన తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. వ్యవసాయరంగంపై కనీసం అవగాహన లేకుండా, ఒక రాష్ట్రానికి పార్టీ అధ్యక్షుడిగా ఉంటూ నిజనిజాలు బేరీజు వేసుకోకుండా మాట్లాడడం సరికాదని సూచించారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి 12లక్షల మెట్రిక్ టన్నుల యూరి యా సరఫరా చేసిందని చెప్పడం వారికి, వారి పార్టీకి రాష్ట్ర రైతాంగం పట్ల ఉన్న నిబద్ధతను తెలియజేస్తుందన్నారు. రైతాంగం విషయంలో ఎలాంటి రాజకీయాలకు తావివ్వకూడదని ఎకన్నోసార్లు వ్యవసాయ మంత్రిగా తాను విన్నవించినప్పటికీ కేంద్రం వైఖరి మారడం లేదని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. వాస్తవానికి రాష్ట్రానికి కేంద్రం ఈ ఖరీఫ్ సీజన్ మొత్తానికి కేవలం 9.80 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా మాత్రమే కేటాయించిందని, ఇది కూడా తెలియకుండా 12 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను సరఫరా చేసిందని చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. తమ రాజకీయ లబ్ధి కోసం రైతులను తప్పుదోవ పట్టించడం ఇకపై మానుకోవాలని మంత్రి తుమ్మల సూచించారు. ఇప్పటికే పలు సందర్భాల్లో గణాంకాలతో సహా కేంద్ర రసాయన మంత్రికి, రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, సహాయ మంత్రి బండి సంజయ్‌లకు లేఖలు రాయడం జరిగిందని తెలిపారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.